www.visalaandhra.com
విశాలాంధ్ర
స్థాపితం : 1952
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఆదివారం
19-11-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 147
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

చంద్రయాన్-4కి సన్నాహాలు

అహ్మదాబాద్: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో రెండు లూనార్ మిషన్లకు సిద్ధమవుతోంది. లూపెక్స్, చంద్రయాన్-4 ప్రాజెక్టుల ద్వారా 350 కేజీల ల్యాండర్‌ను చంద్రుడి 90 డిగ్రీల ప్రాంతంలో(చీకటి వైపు) ల్యాండ్ చేయడానికి, శాంపిల్ రిటర్న్ మిషన్ ప్రయోగానికి పనిచేస్తున్నామని అహ్మదాబాద్‌లోని స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ డైరెక్టర్ నీలేశ్ దేశాయ్ వెల్లడించారు. 'చంద్రయాన్-4లో చంద్రుడిపై దిగిన తర్వాత అక్కడి ఉపరితలం నుంచి నమూనా తీసుకొని వెనక్కు వచ్చే అవకాశం ఉంది. వచ్చే 5-7 ఏళ్లలో ఈ ప్రతిష్ఠాత్మక మిషన్‌ను చేపడతాం' అని ఆయన అన్నారు.

తుది సమరం నేడే

ప్రపంచ కప్ ఫైనల్ ఫీవర్ క్రికెట్ అభిమానులను ఊపేస్తోంది. భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య నేడు జరిగే ఐసీసీ వన్డే ప్రపంచ కప్ ఫైనల్ పోరు కోసం యావత్ భారత్ ఉత్కంఠగా ఎదురు చూస్తోంది. వన్డే ప్రపంచకప్ టైటిల్‌కు టీమిండియా మరో అడుగు దూరంలో ఉంది. లీగ్ దశలో 9 మ్యాచ్‌ల్లో అజేయంగా నిలిచిన రోహిత్ సేన... సెమీస్‌లో కివీస్‌ను ఓడించి ఫైనల్ చేరుకుంది. ఆదివారం నాటి టైటిల్ పోరులో భారత్, ఆస్ట్రేలియా తలపడనున్నాయి. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం కానున్న ఫైనల్ మ్యాచ్‌పై భారీ అంచనాలు ఉన్నాయి.

- అహ్మదాబాద్‌లో వన్డే ప్రపంచకప్ ఫైనల్
- అమీ తుమీ తేల్చుకోనున్న భారత్-ఆస్ట్రేలియా
- మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం

700 ప్రైవేట్ మెంబరు బిల్లులు పెండింగ్

న్యూఢిల్లీ: లోక్‌సభలో దాదాపు 700కు పైగా ప్రైవేట్ మెంబర్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అందులో అత్యధిక బిల్లులు పీనల్ నిబంధనలు, ఎన్నికల చట్టాల నిబంధనల సవరణకు సంబంధించినవే. పార్లమెంటు ఎన్నికలు అనంతరం ప్రస్తుత లోక్‌సభ కొలువుదీరిన 2019 జూన్‌లో అత్యధిక ప్రైవేట్ మెంబరు బిల్లులు సభలో ప్రతిపాదించారు. కొన్ని బిల్లులు మాత్రం ఈ ఏడాది ఆగస్టులో జరిగిన పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టారు. ఎంపీలు తమ వ్యక్తిగత హోదాలో ప్రైవేట్ మెంబర్ బిల్లులు ప్రవేశపెడతారు. ప్రస్తుత చట్టాల్లో లోపాలు, లొసుగులు సవరించడం, కొత్త నిబంధనలు తీసుకురావడం కోసం ఎంపీలు ప్రైవేట్ మెంబరు బిల్లులు తీసుకొస్తారు.

లోక్‌సభలో 713 బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు లోక్‌సభ బులెటిన్ శుక్రవారం ప్రకటించింది. ఉమ్మడి పౌరస్మృతి, లింగ సమానత్వం, వాతావరణ మార్పు, వ్యవసాయం, ప్రస్తుతం ఉన్న క్రిమినల్, ఎన్నికల చట్టాలకు సవరణలు వంటి అంశాలు బిల్లుల్లో పొందుపర్చారు. ప్రైవేట్ మెంబరు బిల్లులపై లోక్‌సభలో లేదా రాజ్యసభలో శుక్రవారం మధ్యాహ్నం చర్చ జరుగుతుంది. దీనిపై సంబంధిత మంత్రి సమాధానం ఇస్తారు. బిల్లును ఉపసంహరించుకోవాల్సిందిగా సభ్యులను కోరతారు. ప్రైవేట్ మెంబర్ బిల్లుపై ఓటింగ్ జరగడం చాలా అరుదుగా కనిపిస్తుంది.

కరువుపై కనికరమేది?

- వర్షాభావంతో 440 మండలాల్లో తీవ్ర దుర్భిక్షం
- వంద మాత్రమే కరువు మండలాలుగా గుర్తింపు
- ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టని యంత్రాంగం
- ప్రభుత్వ నిర్లక్ష్యంపై రేపు, ఎల్లుండి సీపీఐ సామూహిక దీక్షలు

2 లో

రాష్ట్రంలో కరువు విలయ తాండవం చేస్తోంది. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో వేలాది ఎకరాలు బీడు భూములుగా మారాయి. కొద్దోగొప్పో నీటివనరుల ఆధారంగా సాగు చేసిన పంటలు సైతం దిగుబడి సమయంలో నీరందక నిలువునా ఎండిపోయాయి.

కరువుపై అవగాహన లేని మంత్రి కాకాని

వలసల నివారణలో ప్రభుత్వం విఫలం: రామకృష్ణ

విశాలాంధ్ర-నంద్యాల: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్దన్‌రెడ్డికి వ్యవసాయంపైనా, కరువుపైనా అవగాహన ఉందా అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సూటిగా ప్రశ్నించారు. మంత్రి ఏనాడైనా పొలాలు పరిశీలించారా... రైతులతో మాట్లాడారా అని నిలదీశారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావుతో కలసి రామకృష్ణ శనివారం ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంత్రి కాకానికి కరువుపై అవగాహన లేదని విమర్శించారు. కరువుతో రైతులు అల్లాడుతుంటే అధికారులు పట్టించుకోవడం లేదని నిందించారు. శ్రీశైలం

- మిగతా 2 లో

మహిళా రిజర్వేషన్లు

మోదీ ఎన్నికల ఎత్తుగడ

- సనాతన ధర్మం పేరిట వంటింటి కుందేలుగా మహిళలు
- మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభలో జాతీయ నాయకులు శాంతి విమర్శ

విశాలాంధ్ర - నంద్యాల: చట్టసభలలో మహిళలకు మూడో వంతు రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలపడం కేవలం మోదీ ఎన్నికల ఎత్తుగడమాత్రమేనని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్‌డబ్ల్యూ) జాతీయ నాయకులు డాక్టర్ శాంతి విమర్శించారు. మోదీ ప్రభుత్వానికి చిత్తశుద్ధివుంటే 2024 సార్వత్రిక ఎన్నికలలోనే ఈ రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర 15వ మహాసభల రెండో రోజు ప్రతినిధుల సభలో శాంతి ప్రధానోపన్యాసం చేశారు. కొండపల్లి కోటేశ్వరమ్మ ప్రాంగణం (హారూన్ ఫంక్షన్ హాల్)లో శనివారం ప్రతినిధుల సభ ప్రారంభమైంది. సమాఖ్య సీనియర్ నాయకులు డాక్టర్ సంజీవమ్మ సమాఖ్య పతాకాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర నాయకులు నక్కీ బాలమ్మ అమరవీరుల స్థూపాన్ని ఆవిష్కరించారు. తరువాత ప్రతినిధులు, రాష్ట్ర నాయకత్వం అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. వి.జలయలక్ష్మి, విమల, బషీరున్నిసా, సుగుణమ్మ, పమిడిముక్కల రాణి అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. శాంతి ప్రసంగం కొనసాగిస్తూ, మోదీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని తీసుకువస్తున్నదని అన్నారు. సనాతన ధర్మం పేరిట మహిళలను వంటింటి కుందేలుగా మారుస్తోందని విమర్శించారు. ఇటీవల మణిపూర్‌లో మహిళలపై జరిగిన అఘాయిత్యాలు జాతి సిగ్గుపడేలా ఉన్నాయన్నారు. మహిళా సమాఖ్య జాతీయ నాయకురాలు అక్కినేని వనజ

- మిగతా 2 లో

తమిళనాట బిల్లుల యుద్ధం

గవర్నర్ వెనక్కి పంపిన బిల్లులకు అసెంబ్లీ ఏకగ్రీవ ఆమోదం

చెన్నై: గవర్నరు ఆర్ఎన్ రవి ఇటీవల వెనక్కి పంపిన 10 బిల్లులను తమిళనాడు అసెంబ్లీ శనివారం మరోసారి ఆమోదించింది. న్యాయ, వ్యవసాయ, ఉన్నత విద్య సహా వివిధ శాఖలకు సంబంధించిన బిల్లులు ఇందులో ఉన్నాయి. ప్రతిపక్ష ఏఐఏడీఎంకే, బీజేపీ సభ్యులు వేర్వేరుగా సభ నుంచి వాకౌట్ చేశారు. అసెంబ్లీ తీర్మానించిన బిల్లులకు ఆమోదం తెలపకుండా గవర్నర్ జాప్యం చేస్తున్నారని కొంతకాలంగా ఆరోపిస్తున్న తమిళనాడు ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. అసెంబ్లీని ప్రత్యేకంగా సమావేశ పరిచి గతంలో తీర్మానించిన 10 బిల్లులను ఏకగ్రీవంగా మరోసారి ఆమోదించింది. ఎలాంటి కారణాలు చెప్పకుండా గవర్నర్ ఆర్ఎన్ రవి వెనక్కి పంపిన బిల్లులను ఆమోదించి గవర్నర్‌కు తిరిగి పంపాలని ముఖ్యమంత్రి స్టాలిన్ నిర్ణయించడంతో అసెంబ్లీని ప్రత్యేకంగా సమావేశ పరిచారు. తాజాగా ఆమోదం పొందిన బిల్లులలో 2020, 2023లో

- మిగతా 2 లో

ఇదీ లోకం!



మీరు క్రికెటర్ వేషంలో వచ్చినా
మీ వైపు కన్నెత్తి చూడరు.

దక్షిణ గాజా నుంచి వెళ్లిపోండి

- గంటలో అల్ షిఫా ఖాళీ కావాలి: ఇజ్రాయిల్ హెచ్చరికలు
- ఉత్తర గాజాలో కొనసాగిన భీకర దాడులు
- ఆసుపత్రుల తనిఖీలు

గాజా: దక్షిణ గాజా నుంచి వెళ్లిపోవాలని పలస్తీనా ప్రజలకు ఇజ్రాయిల్ శనివారం హుకుం జారీచేసింది. ఉత్తర గాజాపై భీకర దాడులను కొనసాగించింది. దక్షిణ గాజా నుంచి పశ్చిమ ప్రాంతానికి తరలివెళ్లాలని పలస్తీనా ప్రజలకు ఇజ్రాయిల్ రక్షణ దళం (ఐడీఎఫ్) సూచించింది. అదే విధంగా అతిపెద్ద ఆసుపత్రి అల్ షిఫాను గంటలోగా ఖాళీ చేయాలంటూ ఆదేశాలిచ్చింది. దీంతో ఆసుపత్రిలో భయానక వాతావరణ నెలకొన్నదని, ప్రజల్లో భయాందోళన ఉన్నదని, అంతా గందరగోళంగా ఉందని ఆసుపత్రిలోని వర్గాలు వెల్లడించినట్లు జిన్హువా నివేదించింది. రోగులందరినీ తరలించేంత వరకు ఆసుపత్రిని వీడేది లేదని ఆసుపత్రిలోని వైద్య సిబ్బంది తేల్చిచెప్పినట్లు వార్తాసంస్థ పేర్కొంది. దక్షిణ గాజా నుంచి వెళ్లిపోవాలని పలస్తీనా ప్రజలకు సూచించినట్లు ఇజ్రాయిల్ అధికారి ఒకరు తెలిపారు. దాడుల్లో పౌరులు చిక్కుకోకూడదన్నదే తమ ఉద్దేశంగా చెప్పారు. పశ్చిమ ప్రాంతానికి వెళ్లిపోవాలని, అక్కడైతే మానవతా సాయం పొందవచ్చని ఇజ్రాయిల్ సూచనలు చేసింది. అదే సమయంలో అల్-షిఫా సహా అనేక ఆసుపత్రుల్లో ముమ్మర తనిఖీలను కొనసాగించింది. శనివారం తెల్లవారుజామున ఖాన్ యూనిస్‌లోని ఓ ప్రాంతంపై ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో 36 మంది పలస్తీనియన్లు చనిపోయారు. మృతుల్లో చిన్నారులే ఎక్కువని స్థానిక మీడియా పేర్కొంది. ఖాన్ యూనిస్‌లో నాలుగు లక్షల జనాభా ఉండగా, ఇజ్రాయిల్ దాడుల కారణంగా ఉత్తర గాజా నుంచి వేలాది మంది ఆ ప్రాంతానికి తరలి వెళ్లారు. ఇప్పుడు అక్కడ నుంచి పశ్చిమ ప్రాంతానికి వెళ్లిపోవాలని ఇజ్రాయిల్ ఆదేశించడంతో లక్షలాది మంది ప్రజల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

మాల్దీవుల అధ్యక్షుడిగా ముయిజ్జు ప్రమాణం

ఉపాధ్యక్షుడు, కేబినెట్ మంత్రులు కూడా

మాలే: మాల్దీవుల ఎనిమిదో అధ్యక్షునిగా మహమ్మద్ ముయిజ్జు ప్రమాణ స్వీకారం చేశారు. రాజధాని మాలేలో ప్రమాణ స్వీకారోత్సవం జరిగినట్లు అధ్యక్ష కార్యాలయం వెల్లడించింది. రిపబ్లిక్ స్క్వేర్‌లోని పీపుల్స్ మజ్లిస్ ప్రత్యేక అసెంబ్లీలో కార్యక్రమం జరిగినట్లు తెలిపింది. ప్రమాణ స్వీకారం అనంతరం ముయిజ్జు ప్రమాణ పత్రంపై సంతకం చేశారు. ప్రధాన న్యాయమూర్తి ముథాసిమ్ అద్నాన్, పార్లమెంటు స్పీకర్ మహమ్మద్ అస్లం సాక్షి సంతకాలు చేశారు. ముయిజ్జు మాట్లాడుతూ మాల్దీవుల పౌరుల ప్రయోజనాలకు కట్టుబడి ఉంటానని, దేశానికి, దేశ పౌరులకు మొదటి ప్రాధాన్యత ఇస్తానని హామీనిచ్చారు. పర్యాటక రంగాభివృద్ధిపై పూర్తిగా దృష్టిని కేంద్రీకరించనున్నట్లు తెలిపారు. విదేశీ విధానానికి సంబంధించిన తన విజన్‌ను విపులీకరించారు. చుట్టుపక్కల దేశాలతో స్నేహసంబంధాలను కొనసాగిస్తానన్నారు. ఆర్థిక వ్యవస్థ, విద్య, యువత, అభివృద్ధి, మహిళా హక్కులు, గృహ విధానం తదితర అంశాలపై ఆయన మాట్లాడారు. ముయిజ్జు తర్వాత ఉపాధ్యక్షుడిగా హుస్సేన్ మహమ్మద్ లతీఫ్, కేబినెట్ మంత్రులు కూడా ప్రమాణ స్వీకారం చేశారు. కాగా ముయిజ్జు సెప్టెంబరు 30న నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన విషయం తెలిసిందే.

ఇజ్రాయిల్ వద్ద బందీలే ఎక్కువ : ఎర్దోగన్

అంకారా: హమాస్ వద్ద ఉన్న బందీల కంటే అనేక రెట్లు ఎక్కువగా ఇజ్రాయిల్ వద్ద ఉన్నట్లు టర్కీ అధ్యక్షుడు రిసెప్ తయ్యిప్ ఎర్దోగన్ తెలిపారు. బందీల అప్పగింతకు యత్నిస్తున్నామన్నారు. అయితే హమాస్, ఇజ్రాయిల్ వద్ద ఉన్న బందీల లెక్క తేలాలని, దీనిని నిర్లక్ష్యం చేస్తే అన్యాయం చేసిన వారమవుతామని అభిప్రాయపడ్డారు. జర్మన్ ఛాన్సలర్ ఒలాఫ్ స్కోల్ఫ్‌తో బెర్లిన్‌లో భేటీ క్రమంలో ఆయనతో కలిసి విలేకరుల సమావేశంలో ఎర్దోగన్ మాట్లాడారు. టర్కీ ఏ విధంగా ఇజ్రాయిల్‌కు రుణ పడి లేదని చెప్పారు. గాజాపై ఇజ్రాయిల్ దురాక్రమణను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. తమ దేశ వైఖరిని స్వేచ్ఛగా తెలుపగలమని ఆయన అన్నారు. ఒలాఫ్ స్కోల్ఫ్ మాట్లాడుతూ ఇజ్రాయిల్, గాజాలో పౌరుల ప్రాణాలు విలువైనవిగా తెలిపారు. 2023లో 160 మిలియన్ యూరోలకుపైగా పలస్తీనా ప్రజల కోసం మానవతా సాయాన్ని బెర్లిన్ చేసినట్లు వెల్లడించారు. తమ దేశానిది ఇజ్రాయిల్ పక్షమన్నారు. కొన్నిసార్లు భిన్నాభిప్రాయాలు ఉండటం సహజమేనని గాజా పరిణామాలపై ఎర్దోగన్‌తో అన్నారు. అయితే ఇద్దరు నేతలు అనంతరం గాజాకు మానవతా సాయం, కాల్పుల విరమణ, బందీల విడుదలతో పాటు ఉక్రెయిన్ యుద్ధం, స్వీడెన్ నాటో ఆకాంక్షల గురించీ చర్చించారు.

ఏడుకు పెరిగిన ఫిలిప్పీన్స్ భూకంప మృతులు

మనీలా: ఫిలిప్పీన్స్ భూకంప మృతుల సంఖ్య శనివారానికి ఏడుకు పెరిగింది. ఈ మేరకు దేశ పౌర రక్షణ కార్యాలయం (ఓసీడీ) వెల్లడించింది. శుక్రవారం దక్షిణ ఫిలిప్పీన్స్‌లో శక్తిమంతమైన భూకంపం సంభవించింది. దీని తీవ్రత 6.7గా నమోదైంది. ప్రాథమికంగా 7.2 తీవ్రతతో భూకంపం వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఆ తర్వాత 6.8 తీవ్రతతో భూ ప్రకంపనలు సంభవించాయని ఫిలిప్పీన్స్, అమెరికా భూకంప కేంద్రాలు వెల్లడించాయి. భూకంపం ధాటికి అనేక పట్టణాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోగా స్కూలు భవనాలు, ఇళ్లు దెబ్బతిన్నాయి. జనరల్ శాంటోస్ నగరంలో గోడ కూలి ఓ జంట మరణించింది. బాధితులకు తక్షణమే సహాయక సహకారాలు అందేలా చూడాలని ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు మార్కోస్ జూనియన్ ఇప్పటికే ప్రభుత్వ అధికారులకు ఆదేశాలు జారీచేశారు.

గాయపడిన పలస్తీనా పిల్లలతో యూఏఈకి తొలి విమానం

అబూదాబీ: ఇజ్రాయిల్ దాడుల్లో తీవ్రంగా గాయపడిన పలస్తీనా పిల్లలతో మొదటి విమానం శనివారం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) చేరుకుంది. ఇజ్రాయిల్-హమాస్ పోరు క్రమంలో వెయ్యి మంది పిల్లలకు సాయం చేస్తామని యూఏఈ సంకల్పించింది. దీంతో పిల్లలకు వైద్య సౌకర్యాన్ని కల్పిస్తోంది. పిల్లలు, వారి కుటుంబ సభ్యులు సహా 15 మంది రాఫా సరిహద్దు వెంబడి ఈజిప్టుకు చేరుకొని అక్కడ నుంచి విమానంలో యూఏఈకి పయనమయ్యారు. రాజధాని అబూదాబీ అంతర్జాతీయ విమానాశ్రయానికి విమానం చేరుకునే సరికి పిల్లలు నీరసంగా తమ తల్లుల ఒడిలో సేదతీరుతూ కనిపించారు. తీవ్రంగా గాయపడిన వారి కోసం విమానంలోని కొన్ని సీట్లు తొలగించి స్ట్రెచర్లు ఏర్పాటు చేశారు. చిన్న పిల్లలు చేతులు, కాళ్లకు బాండేజిలతో ఉన్నారు. కొందరు ఒంటరిగా, ఇంకొందరు తమ తల్లిదండ్రులు/బంధువులతో కలిసి ప్రయాణించారు. ఒంటరిగా వచ్చానని 12 ఏళ్ల అమర్ జాందే చెప్పాడు. 'నాన్న, మావయ్యతో కలిసి వీధిలో మాట్లాడుతున్నప్పుడు క్షిపణి దాడి జరిగింది. మావయ్య చనిపోయారు. నాన్నకు గాయాలయ్యాయి. నేను స్పృహ కోల్పోయా. కళ్లు తెరిచి చూసే సరికి ఆసుపత్రిలో ఉన్నా' అని అన్నాడు. 14ఏళ్ల మహమ్మద్ అబూ తాబిక్ మెడ, వెన్ను విరిగిపోయాయి. కారులో వెళు తుండగా దాడి జరిగినట్లు అతను చెప్పాడు. నబీలా మహమ్మూద్ తన 17ఏళ్ల కుమార్తె రవాన్‌తో అబూదాబీ వచ్చారు. రవాన్ నడుము విరిగిపోయింది. తమ ఇంటిపై క్షిపణి పడిందని, 13 మంది కుటుంబ సభ్యులను కోల్పోయామని నబీలా కన్నీళ్లు పెట్టుకున్నారు. ఏడు వారాలుగా గాజాలో భీకర దాడులు జరుగుతుండగా, దాదాపు 12వేల మంది పలస్తీనియన్లు మృత్యువాత పడ్డారు.

22న జీ20 వర్చువల్ సమావేశం

న్యూఢిల్లీ: భారత్ అధ్యక్షతన జీ20 శిఖరాగ్ర సమావేశాలు సెప్టెంబరులో అట్టహాసంగా జరిగాయి. ఈ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలు తీరుపై చర్చించేందుకు బుధవారం వర్చువల్‌గా సమావేశం కాబోతున్నట్లు విదేశీ వ్యవహారాల శాఖ (ఎంఈఏ) శనివారం తెలిపింది. రెండు నెలల కిందట న్యూఢిల్లీలో జరిగిన వార్షిక సదస్సు నిర్ణయాల సమర్థ అమలుపై చర్చలు జరపడమే ఈ సమావేశం ఉద్దేశమని వెల్లడించింది. రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయిల్-హమాస్ పోరు గురించీ చర్చలు ఉండనున్నట్లు పేర్కొంది. జీ20 ముగింపు సమావేశంలో ఈ వర్చువల్ సమావేశం గురించి ప్రధాని ప్రకటించడాన్ని గుర్తుచేసింది. జీ20 సభ్యదేశాలు, ఆఫ్రికన్ యూనియన్, తొమ్మిది అతిథి దేశాలు, 11 అంతర్జాతీయ సంఘాలకు ఆహ్వానాలు పంపినట్లు ఏంఈఏ అధికారిక ప్రకటన వెల్లడించింది. ఈనెల 30 వరకు జీ20కి భారత్ అధ్యక్షత వహిస్తుంది. ఆ తర్వాత బ్రెజిల్ ఈ బాధ్యతలు తీసుకుంటుంది.

కరువుపై కనికరమేది?

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో కరువు విలయ తాండవం చేస్తోంది. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో వేలాది ఎకరాలు బీడు భూములుగా మారాయి. కొద్దోగొప్పో నీటివనరుల ఆధారంగా సాగు చేసిన పంటలు సైతం దిగుబడి సమయంలో నీరందక నిలువునా ఎండిపోయాయి. దీంతో రైతులు రెండువిధాలా ఆర్థికంగా నష్టపోయారు. వ్యవసాయ కూలీలు పనుల్లేక ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నారు. కుటుంబాలకు కుటుంబాలు ఇతర రాష్ట్రాలకు వెళు తుండటంతో గ్రామాలు ఖాళీ అవుతున్నాయి. రాష్ట్రంల్లో దాదాపు 440 మండలాల్లో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వం మాత్రం కేవలం 103 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించి చేతులు దులుపుకున్నది. రాష్ట్రం సహా దేశవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ స్థితి నెలకొంటుందని వాతావరణ, పర్యావరణవేత్తలు ముందస్తు హెచ్చరికలు చేసినా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఏమాత్రం కరువు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టలేదు.

ఖరీఫ్ పంట సాధారణ విస్తీర్ణం 34.39 లక్షల హెక్టార్లు కాగా, సాగైనది 24.98 లక్షల హెక్టార్లు మాత్రమే. దాదాపు 10 లక్షల హెక్టార్ల భూముల్లో సాగు జరగక బీళ్లుగానే ఉన్నాయి. ఖరీఫ్ పంటకాలంలో సాధారణ వర్షపాతం 719.6 మి.మీటర్లు కాగా 504 మి.మీటర్లు మాత్రమే నమోదైంది. మొత్తం ఖరీఫ్ సీజన్‌లో 29.8 శాతం మాత్రమే వర్షపాతం నమోదైంది. మరోపక్క రాష్ట్రంలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తగ్గిపోయాయి. ఆగస్టులో 122 సంవత్సరాల క్రితం నమోదైన అతి తక్కువ వర్షపాతం (47.7%) నమోదైంది. సెప్టెంబరు, అక్టోబర్ మాసాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదై పంటలు ఎండిపోయాయి. పంటలు కాపాడుకోవటం కోసం రైతాంగం పడిన అవస్థలు వర్ణనాతీతం. సుదూర ప్రాంతాల నుండి పైపుల ద్వారా, ట్యాంకర్ల ద్వారా నీరు తెచ్చి వేలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు.

అక్టోబరులో రాష్ట్రవ్యాప్తంగా 89 శాతం, రాయలసీమ జిల్లాల్లో 90 శాతం తక్కువగాను ప్రత్యేకించి కర్నూలు జిల్లాలో 99 శాతం, ముఖ్యమంత్రి సొంత జిల్లా కడపలో 97 శాతం, కోస్తా జిల్లాల్లో 88 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. వర్షాభావ తీవ్రతతో అన్ని జిల్లాల్లో భూగర్భజలమట్టం తగ్గిపోయి ప్రమాదకరస్థాయికి చేరుకుంటున్నది. రాయలసీమ జిల్లాల్లో సగటుకన్నా 2.75 మీటర్లు తగ్గింది. కోస్తాంధ్ర జిల్లాల్లో 1.49 మీటర్లు, రాష్ట్రవ్యాప్తంగా 1.88 మీటర్ల మేర భూగర్భజల మట్టం తగ్గి సాగు, తాగు నీటి బోర్లు వట్టిపోయాయి. రాయలసీమతోపాటు చాలా జిల్లాల్లో 800 నుండి 1200 అడుగులలోతు బోర్లు వేసినా నీరు పడడం లేదు. ప్రభుత్వం సంకల్పించిన జలకళ పథకం వట్టిపోయింది. బోర్లు వేసేందుకు, విద్యుత్ కనెక్షన్లకు, మోటార్లకు రైతులు లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తూ ఆర్థికభారంతో కుంగిపోతున్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియతో ఉచిత విద్యుత్తుకు ప్రభుత్వం తిలోదకాలు ఇస్తుందనే భయాందోళన రైతాంగాన్ని వేధిస్తున్నది. విద్యుత్ కోతలతో రైతులు జాగారం చేస్తున్నారు. ఈ స్థితిలో కరువు మండలాల ప్రకటన రైతులను, గ్రామీణ పేదలను అశనిపాతానికి గురిచేసింది. కరువుపై ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడంలో ముఖ్యమంత్రి స్పందన కొరవడింది. ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజాప్రతినిధులు రైతాంగాన్ని కలిసి మనోధైర్యం కల్పించాలన్న విజ్ఞత కూడా లేకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేవలం 103 మండలాల్లో కరువు బాధితులకు సహాయ చర్యలు అందించేందుకు రూ.688 కోట్లు సహాయం చేయాలని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం నివేదిక పంపడం అన్నదాతలను మరింత బాధిస్తోంది. మిగిలిన మండలాల్లో కరువు పరిస్థితులు పాలకులకు కనపడడం లేదా అని వారు ప్రశ్నిస్తున్నారు.

కృష్ణాజలాల పునఃపంపిణీపై కేంద్రం కుట్ర

రాష్ట్రంలో సాగునీటి హక్కులకు భంగం కలిగిస్తూ అక్టోబరు 4న కేంద్రమంత్రివర్గం కృష్ణాజలాల పునఃపంపిణీకి అనుమతిస్తూ ఆంధ్రప్రదేశ్ విభజన చట్టానికి తూట్లు పొడుస్తూ నిర్ణయం తీసుకున్నది. అక్టోబరు 6న జీవో విడుదల చేసి మన రాష్ట్రానికి తీరని ద్రోహం తలపెట్టింది. తెలంగాణ ఎన్నికల్లో రాజకీయ లబ్ధిపొందాలనే కుసంస్కారానికి తెరలేపింది. ఇటీవల ఇదే పద్ధతిలో కర్నాటక రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాయలసీమ నీటి హక్కులకు నష్టం కలిగేలా తుంగభద్ర నదిపై అక్రమంగా నిర్మిస్తున్న ఎగువభద్ర ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పిస్తూ 5,300 కోట్లు బడ్జెట్‌లో కేటాయించి కేంద్ర ప్రభుత్వం వివాదానికి తెరతీసింది. ఉమ్మడి రాష్ట్రానికి బచావత్ ట్రిబ్యునల్ 811 టీఎంసీల కృష్ణాజలాలు కేటాయిస్తే విభజన సందర్భంలో ఆంధ్రప్రదేశ్‌కి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు కేటాయించారు. బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ అవార్డును ఇంతవరకు కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేయలేదు. ఆంధ్ర, తెలంగాణ మధ్య కృష్ణాజలాల పంపిణీ బాధ్యతను తిరిగి అదే ట్రిబ్యునల్‌కి అప్పగించడం మరో విచిత్రం. మహారాష్ట్ర, కర్నాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ను కలిపి కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాల్సి ఉండగా ఆంధ్ర, తెలంగాణలకు మాత్రమే కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటు చేయడం కేంద్ర బీజేపీ ప్రభుత్వ కుట్రపూరిత వైఖరికి నిదర్శనం. ఇది అమలు జరిగితే తెలంగాణలో అక్రమంగా నిర్మిస్తున్న ప్రాజెక్టులకు ఆమోదముద్ర పడినట్లే. మన రాష్ట్ర నీటి హక్కులు, ప్రయోజనాలు మంటగలిసినట్లే. రాయలసీమతో పాటు నాగార్జునసాగర్ ఆయకట్టు ప్రాంతం ఎడారికాక తప్పదు. కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి ఇంత ద్రోహం చేస్తున్నా ముఖ్యమంత్రి ఏ మాత్రం స్పందించకపోవడం, కేంద్రాన్ని పల్లెత్తుమాట అనే ధైర్యం చేయలేకపోవడంపై రైతు నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రేపట్నుంచి సీపీఐ 30 గంటల దీక్ష

రాష్ట్రంలో కరువు సహాయక చర్యలు చేపట్టాలని, కృష్ణా జలాల పునఃపంపిణీతో రాష్ట్ర నీటి హక్కులకు కేంద్రం చేస్తున్న కుట్రలకు నిరసనగా నవంబరు 20, 21 తేదీలలో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) అధ్వర్యంలో విజయవాడ ధర్నాచౌక్ వద్ద '30 గంటల సామూహిక నిరసన దీక్ష' చేపడుతున్నారు. నిరసన దీక్షలో రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు, రైతు, ప్రజాసంఘాల నేతలను, సాగునీటిరంగ నిపుణులు, మేధావులు పాల్గొని సంఘీభావం తెలియజేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విజ్ఞప్తి చేశారు.

మహిళా రిజర్వేషన్లు మోదీ ఎన్నికల ఎత్తుగడ

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను అప్పనంగా అదాని అంబానీలకు కేంద్ర ప్రభుత్వం కట్టబెడుతోందని విమర్శించారు. బీఎస్ఎన్ఎల్, వైజాగ్ స్టీల్, ఎల్ఐసి, రైల్వేలను ప్రైవేట్ కు అప్పజెప్పేందుకు రంగం సిద్ధం చేశారన్నారు. మహిళల రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గా భవాని కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. 2019 జనవరిలో రాష్ట్ర 14వమహాసభలు జరిగాయని అప్పటినుండి జరిగిన కార్యక్రమాలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం దశలవారీగా మద్యనిషేధాన్ని అమలు చేస్తానని చెప్పి విచ్చలవిడిగా ప్రభుత్వమే మద్యం విక్రయాలు సాగిస్తున్నదని విమర్శించారు. ఐద్వా నాయకురాలు రమాదేవి సౌహార్ద్ర సందేశం ఇస్తూ, ఎన్డీయే పాలనలో సంప్రదాయం, సంస్కృతి పేరిట మహిళలను అణచివేస్తున్నారన్నారు. స్త్రీ, పురుషులను సమానంగా చూడాలన్నారు. విద్యార్థి నాయకురాలు ఖమర్ బేగం సౌహార్ద్ర సందేశం ఇస్తూ మహిళలు అంతరిక్షానికి వెళ్లే స్థాయికి చేరారని, యుద్ధ విమానాలు నడిపే స్థాయి వరకు చేరుకున్నారన్నారు. ఆర్థికంగా, సామాజికంగా కూడా మహిళలు ఎదగాలన్నారు. మహిళల పట్ల వివక్ష తగదన్నారు. మహిళా సమాఖ్య పోరాటాలతో అనేక చట్టాలను తెచ్చిందని, కానీ అవి అమలుకు నోచుకోకపోవడం విచారకరమన్నారు. రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి అరుణ మాట్లాడుతూ మైక్రో ఫైనాన్స్ దాడులు జరిగిన సమయంలో వాటి నిర్మూలనకు చట్టాలను తెచ్చిన ఘనత తమదేనన్నారు. మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా మహిళలను చైతన్య పరచాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో పిడికిటి సంధ్య, యామిని, సీపీఐ రాష్ట్ర సహ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గసభ్యులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు, ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంచలయ్య, నంద్యాల జిల్లా కార్యదర్శి శివయ్య, కర్నూలు జిల్లా కార్యదర్శి నాగరాజు, ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శులు నాగరాముడు, ధనుంజయుడు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫకృద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

కరువుపై అవగాహన లేని మంత్రి కాకాని

(మొదటిపేజీ తరువాయి)

జలాశయంలో నీళ్లు లేవని, రాష్ట్రవ్యాప్తంగా 24 లక్షల ఎకరాల్లో సాగు లేదన్నారు. 440 మండలాల్లో కరువు ఉంటే కేవలం 103 మండలాలనే కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించిందని ఆరోపించారు. రాయలసీమ, ప్రకాశం జిల్లాలో ప్రజలు వలస పోతున్నారని, వలసల నివారణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రామకృష్ణ విమర్శించారు. కర్నాటక ప్రభుత్వాన్ని చూసైనా జగన్ ప్రభుత్వం బుద్ధి తెచ్చుకోవాలన్నారు. సిద్దరామయ్య ప్రభుత్వం అక్టోబర్‌లోనే కరువు జిల్లాలు ప్రకటించిందని గుర్తుచేశారు. కరువుకు సంబంధించి జగన్ ప్రభుత్వం కేంద్రానికి నివేదిక ఇచ్చిందా...ఇస్తే దానిని బహిర్గతం చేయాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. రెవెన్యూశాఖ మంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ప్రిన్సిపల్ సెక్రటరీ ఏమి చేస్తున్నారని నిలదీశారు. కరువుపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈనెల 20, 21 తేదీల్లో విజయవాడలో 30 గంటల దీక్ష చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కర్నాటక ప్రభుత్వం నిర్మిస్తున్న ఎగువభద్ర ప్రాజెక్టుతో రాయలసీమ ఎడారిగా మారుతుందని చెప్పారు. సీపీఐ పోరాటాలతో లక్షలాది ఎకరాల భూములను పేదలకు పంపిణీ చేసిందని, ఇప్పుడేదో కొత్తగా భూములు ఇస్తున్నట్లు సీఎం జగన్ చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రామాంజనేయులు, నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు పాల్గొన్నారు.

తమిళనాట బిల్లుల యుద్ధం

(మొదటిపేజీ తరువాయి)

అసెంబ్లీ తీర్మానించిన రెండేసి బిల్లులు ఉండగా... మరో ఆరు బిల్లులు 2022లోనే ఆమోదించినవి ఉన్నాయి. ఇందులో వైస్ చాన్సలర్ల నియామకంలో గవర్నర్ అధికారాలను తొలగించేలా తీసుకొచ్చిన తీర్మానం కూడా ఉంది. వర్సిటీల వీసీలను రాష్ట్ర ప్రభుత్వమే నియమించేలా తమిళనాడు విశ్వవిద్యాలయాల చట్టంలో సవరణలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ బిల్లు తీసుకొచ్చింది. బిల్లులపై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి స్టాలిన్ మాట్లాడుతూ గవర్నర్‌పై విమర్శలు గుప్పించారు. ఎలాంటి కారణం చూపకుండా బిల్లులు నిలిపివేయడం ఆమోదయోగ్యం కాదని అన్నారు. కేవలం ఆయన వ్యక్తిగత కారణాలతోనే బిల్లులకు ఆమోదం తెలపకుండా వెనక్కి పంపారని, ఇది అప్రజాస్వామికం. ప్రజా వ్యతిరేకమని స్టాలిన్ విమర్శించారు. బీజేపీ యేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో గవర్నర్లను అడ్డం పెట్టుకొని కేంద్రం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. తమిళనాడులో డీఎంకే ప్రభుత్వానికి, గవర్నర్ ఆర్ఎన్ రవికి కొంతకాలంగా పొసగడం లేదు.

జనవరి 4న చెన్నైలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో గవర్నర్ చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారం రేపాయి. దేశం మొత్తానికి వర్తించేదాన్ని తమిళనాడు మాత్రం కాదని చెబుతుంతనా, ఇది ఓ అలవాటుగా మారిపోయిందని గవర్నరు తీవ్రంగా వ్యాఖ్యానించారు. అప్పటి నుంచి మొదలైన వివాదం ఇప్పటికీ కొనసాగుతోంది. అసెంబ్లీ తీర్మానించిన బిల్లులను పెండింగ్‌లో ఉంచడంతో తమిళనాడు ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దీనిపై నవంబర్ 10న విచారణ చేపట్టిన అత్యున్నత న్యాయస్థానం గవర్నర్ తీరుపై అసహనం వ్యక్తం చేసింది. 12 బిల్లుల పెండింగుకు సంబంధించి తమిళనాడు ప్రభుత్వం చేస్తోన్న ఆరోపణలపై ప్రతిస్పందన తెలపాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

ఆర్బీఐ మాజీ గవర్నర్

వెంకట రమణన్ మృతి

చెన్నై: భారత రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) మాజీ గవర్నర్ ఎస్.వెంకటరమణన్ (92) చెన్నైలో శనివారం కన్నుమూశారు. ఈ మేరకు ఆర్బీఐ ప్రకటించింది. ఐఏఎస్ కూడా అయిన వెంకటరమణన్ 1990 డిసెంబరు 22 నుంచి 1992 డిసెంబరు 21వ తేదీ వరకు ఆర్బీఐ గవర్నర్‌గా పనిచేశారు. అప్పట్లో దేశం తీవ్రమైన చెల్లింపుల సంక్షోభాన్ని ఎదుర్కొంది. 1985 నుంచి 1989 వరకు ఆర్థిక శాఖ కార్యదర్శిగానూ వెంకటరమణన్ బాధ్యతలు చేపట్టారు. ఆర్బీఐ గవర్నర్‌గా నియామకానికి ముందు కర్నాటక ప్రభుత్వ సలహాదారునిగా పనిచేశారు. 'వెంకటరమణన్ హయాంలో దేశం ఆర్థిక కష్టాల్లో ఉంది. చెల్లింపుల సంక్షోభాన్ని ఎదుర్కొంది. ఆయన తన శక్తియుక్తులతో ఆ గడ్డు పరిస్థితులను అధిగమించేందుకు కృషిచేశారు' అని ఆర్బీఐ తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. రూపాయి పడిపోవడం, ఆర్థిక సంస్కరణలు జరగడం, ఐఎంఎఫ్ సుస్థిర కార్యక్రమాన్ని భారత్ చేపట్టడం వంటివన్నీ ఆయన పదవీ కాలంలోనే జరిగినట్లు వెల్లడించింది. వెంకటరమణ సేవలను కొనియాడింది. వెంకట రమణకు ఇద్దరు కుమార్తెలు. వారిలో ఒకరు గిరిజా వైద్యనాథన్. ఈమె తమిళనాడు రాష్ట్ర మాజీ సీఎస్. కాగా, వెంకటరమణన్ 1931లో తమిళనాడు, నాగర్‌కోయిల్ (ట్రావెన్‌కోర్ సంస్థానం)లో జన్మించారు.

శాంతి పునరుద్ధరించాలి

కేంద్రం, ప్రధాని జోక్యంతోనే సమస్యకు పరిష్కారం

అఖిపక్షాన్ని పిలవాలి: మణిపూర్ గవర్నర్‌కు పది విపక్షాల వినతి

ఇంఫాల్: చాలా కాలంగా హింసతో అట్టుడికిపోతున్న మణిపూర్‌లో శాంతిని పునరుద్ధరించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని గవర్నర్ అనసూయ ఉయికెను పది ప్రతిపక్ష పార్టీల బృందం కోరింది. కేంద్రం, ప్రధాని జోక్యం చేసుకుంటేనే ఈ సమస్య పరిష్కారం కాగలదని తెలిపింది. ఇదే క్రమంలో అఖిలపక్ష సమావేశాన్ని రాష్ట్రంలో నిర్వహించాలని సూచించింది. ఘర్షణ పడుతున్న వర్గాలతో శాంతి చర్చలు ప్రారంభించాలని సీపీఐ, సీపీఎం, జేడీయూ, ఎన్‌సీపీ, ఆర్ఎస్పీ, శివసేన(యూబీటీ), ఆప్, ఏఐఎఫ్‌బీ, ఏఐటీసీ నాయకులు కోరారు. కాంగ్రెస్ నేత, మాజీ సీఎం ఐబోబి సింగ్ నేతృత్వంలో గవర్నర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. గవర్నర్‌తో పది ప్రతిపక్ష పార్టీల నాయకులు భేటీ అయినట్లు రాజ్‌భవన్ ఓ ప్రకటన విడుదల చేసింది. శాంతి చర్చలను జరిపేందుకు కృషి చేస్తానని గవర్నర్ చెప్పినట్లు తెలిపింది. తమకు బలమున్న ప్రాంతాల్లో సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుంటామంటూ కుకీ-జో వర్గాల సంస్థ ఐటీఎల్ఎఫ్ ప్రతినిధులు బుధవారం గవర్నర్‌ను కలిసిన క్రమంలో విపక్ష నేతల భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది.

సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేసుకునే ప్రతిపాదనను మణిపూర్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఇది చట్టవిరుద్ధమని పేర్కొంది. అయితే ప్రధాని నాయకత్వం, మార్గదర్శకత్వంలో మణిపూర్ సమస్య పరిష్కారం కాగలదని ప్రతిపక్ష నేతలు నొక్కిచెప్పారు. దీనిపై అఖిలపక్షాన్ని ఏర్పాటు చేయాలని గవర్నర్‌కు సూచించారు. సానుకూలంగా స్పందించిన గవర్నర్ చేయగలిగినదంతా చేస్తానన్నారు. ఇప్పటికే రాష్ట్ర పరిస్థితిపై కేంద్రానికి నివేదించినట్లు తెలిపారు. కేంద్రంతో సంప్రదింపులు జరుగుతున్నట్లు వెల్లడించారు. మే నుంచి మణిపూర్‌లోని కుకీ, మయితే వర్గాల మధ్య ఘర్షణలు కొనసాగుతుండటం విదితమే.

నింగిలోకి 'స్టార్‌షిప్'

రెండో ప్రయోగం విఫలం



వాషింగ్టన్: స్పేస్‌ఎక్స్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ప్రపంచంలోని అతిపెద్ద రాకెట్ 'స్టార్‌షిప్' నింగిలోకి దూసుకెళ్లింది. శనివారం ఉదయం దక్షిణ టెక్సాస్ తీరంలో ఈ ప్రయోగం జరిగింది. ప్రయోగించిన నిమిషాల వ్యవధిలోనే స్టార్‌షిప్‌ను అంతరిక్షం వైపునకు బూస్టర్ పంపింది కానీ ఎనిమిది నిమిషాలకే సంబంధాలు తెగిపోయాయి. దీంతో ఈ వాహనం విఫలమైనట్లు స్పేస్‌ఎక్స్ ప్రకటించింది. తన పనిని చేసిన వెంటనే బూస్టర్ పేలిపోయింది. బూస్టర్ విడిపోయి, అంతరిక్ష నౌకను అంతరిక్షంలోకి పంపడమే ఈ ప్రయోగం లక్ష్యం. ఏప్రిల్‌లో మొదటి ప్రయోగం విఫలమైంది. ప్రయోగించిన 4 నిమిషాలకే గల్ఫ్ ఆఫ్ మెక్సికోలో కూలిపోయింది. రాకెట్, లాంచ్ ప్యాడ్‌లను మరింత అభివృద్ధి చేసిన తర్వాత రెండవసారి స్టార్‌షిప్‌ను స్పేస్‌ఎక్స్ ప్రయోగించింది. అమెరికా గగనతల నిర్వహణ సంస్థ సూచించిన 57 మార్పులూ చేపట్టింది. ఎఫ్ఏఏ అనుమతితో ఈ ప్రయోగం చేపట్టింది. రెండో ప్రయోగంలో రాకెట్ గాల్లోకి ఎగిరిన 2.48 నిమిషాలకు బూస్టర్ విజయవంతంగా విడిపోయింది. భూమి చుట్టు పరిభ్రమణం తర్వాత పసిఫిక్ సముద్రంలో పడిపోయే విధంగా ఈ ప్రయోగాన్ని స్పేస్‌ఎక్స్ చేపట్టింది. 'స్టార్‌షిప్' పొడవు 121 మీటర్లు (400 అడుగులు). చంద్రుడు, అంగారకుడిపైకి వెళ్లేందుకు దీనిని 'స్పేస్‌ఎక్స్ రూపొందించింది.

20, 21 తేదీల్లో 30 గంటల దీక్ష

విశాలాంధ్ర- ఉయ్యూరు: కృష్ణా జలాల పున:పంపిణీపై కేంద్ర ప్రభుత్వ గెజిట్ నోటిఫికేషన్, కరువు సమస్యలపై ఈనెల 20, 21 తేదీల్లో సీపీఐ అధ్వర్యంలో విజయవాడ ధర్నాచౌక్‌లో 30గంటల నిరసన దీక్ష జరుగుతుందని రైతు సంఘం ఏపీ ప్రధాన కార్యదర్శి కేవీవీప్రసాద్ తెలిపారు. కంకిపాడులోని సీపీఐ కార్యాలయంలో ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో 80 లక్షల ఎకరాల్లో పంటలు వేయాల్సి ఉండగా, 24 లక్షల ఎకరాల్లో వేయలేదన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటివరకు కరువు గురించి మాట్లాడలేదన్నారు. ఖరీఫ్ దృష్ట్యా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ముందస్తు ఏర్పాట్లు చేయనిపక్షంలో సీపీఐ, రైతు సంఘాలు ఆందోళనకు దిగుతాయని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు హెచ్చరించారు. దీక్ష పోస్టరును సీపీఐ జిల్లా కార్యదర్శి టి తాతయ్య, నియోజకవర్గ కార్యదర్శి మున్నంగి నరశింహరావు ఆవిష్కరించారు.

ఆవంత్స సోమసుందర్ శతజయంత్యుత్సవ సదస్సు నేడు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): వజ్రాయుధ కవి, కళారత్న ఆవంత్స సోమసుందర్ శతజయంత్యుత్సవ సదస్సు ఆదివారం కాకినాడ జిల్లా, పిఠాపురంలోని శ్రీసూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో జరగబోతోంది. అధికార భాషా సంఘం మాజీ అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, అభ్యుదయ రచయిత చందు సుబ్బారావు, అరసం ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, చెలికాని స్టాలిన్ (చెలికాని రామారావు స్మారక సమితి), పి.చిరంజీవిని కుమారి (గోదావరి రచయితల సంఘం), పీఆర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ భారతలక్ష్మీ, సోమసుందర లిటరరీ ట్రస్ట్ అధ్యక్షుడు కె.వెంకట్రావు, ఉపాధ్యక్షుడు గజరావు సీతారామస్వామి, కోశాధికారి మేకా మన్మథరావు, ఉప కార్యదర్శి ఆవంత్స విజయ శేషేంద్ర శాతకర్ణి, మువ్వా పద్మావతి రంగయ్య ఫౌండేషన్, ఖమ్మం నుంచి మువ్వా శ్రీనివాసరావు సుహృద్భావ సందేశాలు ఇవ్వనున్నారు.

ఏపీ వ్యవసాయ శాఖకు స్కోచ్ అవార్డు



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఏపీ వ్యవసాయశాఖను స్కోచ్- 2023 అవార్డు వరించింది. ఈ-క్రాప్ విధానానికిగాను జాతీయ పురస్కారం లభించింది. శనివారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ చేకూరు హరికిరణ్ అందుకున్నారు. సాంకేతికతను వినియోగించి ప్రజలకు సేవ చేస్తున్న వివిధ ప్రభుత్వ విభాగాలు, సంస్థలను స్కోచ్ అవార్డుతో సన్మానిస్తున్నట్లు ఆయన తెలిపారు. రైతుల భూమి, సాగు వివరాలను గ్రామ రెవెన్యూ. వ్యవసాయ సహాయకుడు నమోదు చేసి, ఆ సమాచారం సరైనదేనని వేలిముద్రల ద్వారా ధృవీకరిస్తునట్లు చెప్పారు. ఈ-క్రాప్ సమాచారం... డేటా కేంద్రీకృత సమాచార ప్లాట్‌ఫామ్ (కేంద్రం)గా దోహదమవుతోందని తెలిపారు. స్కోచ్ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందని హరికిరణ్ అన్నారు.

హంద్రీనీవా నీటి తరలింపు అడ్డుకోవాలి

జగదీశ్ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం : అనంతపురం జిల్లాలో కరువు తారాస్థాయికి చేరి సాగు, తాగు నీటి కోసం ప్రజలు కటకటలాడు తుంటే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి డీఐజీ స్థాయి అధికారిని కాపలాపెట్టి హంద్రీనీవా నీటిని తమ పుంగనూరుకు తరలిస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి. జగదీశ్ విమర్శించారు. ఇంత ఘోరం జరుగుతున్నా జిల్లా ఎమ్మెల్యేలు ఏమాత్రం అడ్డు చెప్పకపోవడం విచారకర మన్నారు. అనంతపురం జిల్లా పామిడి పట్టణం షాది ఖానాలో శనివారం సీపీఐ సర్వసభ్య సమావేశం పట్టణ కార్యదర్శి నాగరాజు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జగదీశ్ మాట్లాడుతూ కరువు నుంచి రైతులను ప్రభుత్వమే ఆదుకునే దిశగా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈ నెల 20, 21 తేదీల్లో విజయవాడలో 30 గంటల సామూహిక దీక్షలు చేపడుతున్నట్లు జగదీశ్ తెలిపారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదింపేందుకు ప్రతిపక్ష పార్టీలు అన్నీ కలిసి ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే దొరల పాలన ప్రారంభమైందని దానిని అంత మొందించాల్సిన అవసరం ఎంతైనా ఉంద న్నారు. ఈ సమావేశంలో సీపీఐ గుంతకల్లు నియోజకవర్గ కార్యదర్శి వీరభద్ర స్వామి, రైతు సంఘం నియో జకవర్గ కార్యదర్శి రామాం జనేయులు యాదవ్, సీపీఐ నియోజకవర్గ నాయకుడు రహీం తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సాధికారతకు పెద్దపీట వేసిన జగన్

విశాలాంధ్ర-పత్తికొండ : సామాజిక సాధికారతకు పెద్దపీట వేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందని ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, మంత్రులు ఆదిమూలపు సురేశ్, గుమ్మనూరు జయరాం, ఉషశ్రీ చరణ్ అన్నారు. వైసీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర శనివారం పత్తికొండ చేరుకుంది. ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ నుంచి బస్సు యాత్ర ర్యాలీ ప్రారంభమై పట్టణ పురవీధుల గుండా భారీ ప్రదర్శన చేపట్టారు. అనంతరం గుత్తి సర్కిల్ కూడలిలో నిర్వహించిన బహిరంగ సభలో మంత్రులు మాట్లాడుతూ నాలుగున్నర సంవత్సరాల వైసీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్ని విధాలుగా పెద్దపీట వేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అని తెలిపారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో అణగారిన వర్గాలకు చంద్రబాబు చేసింది ఏమీ లేదన్నారు. మరో ఐదు నెలలలో ఎన్నికలు సమీపిస్తున్న వేళ చంద్రబాబు ఎలాగైనా అధికారంలోకి వచ్చేందుకు రాష్ట్ర భవితకు భవిష్యత్తు బాబు అంటూ మరో కొత్త నాటకానికి శ్రీకారం చుట్టారని విమర్శించారు. సీఎం జగన్ కుల, మత, రాజకీయాలకతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించడమే కాకుండా అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలాంటివని పేర్కొంటూ ముందుకు వెళుతున్నారని తెలిపారు. 2024 ఎన్నికలలో రాష్ట్రానికి మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సామాజిక సాధికార బస్సు యాత్ర ప్రదర్శన ముందు భాగాన చెక్కభజన, గొరవయ్యలు, గిరిజన లంబాడీల నృత్య ప్రదర్శన పట్టణ ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. స్థానిక ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, పార్టీ జిల్లా అధ్యక్షులు బి.వై.రామయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీ సంజీవ్ కుమార్, మాజీ ఎంపీ బుట్టా రేణుక, ఎమ్మెల్సీలు మధుసూదన్, రమేశ్ యాదవ్, వైసీపీ జిల్లా, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జగనన్న విద్యా దీవెన, వసతి దీవెనకు

జాయింట్ అకౌంట్ రద్దు చేయాలి: ఏఐఎస్ఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలకు తల్లితోపాటు విద్యార్థి జాయింట్ అకౌంట్ తెరవాలని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో విద్యార్థులకు ఇచ్చే ఫీజు రీయెంబర్స్‌మెంట్, కళాశాలల ప్రిన్సిపాల్ అకౌంట్‌లో వేసేవారిని, ఆ తరువాత విద్యార్థి తల్లి ఖాతాలో మూడేళ్లుగా జమ చేస్తున్నదని, కొత్తగా తల్లి, విద్యార్థి జాయింట్ అకౌంట్ ఉండాలం టోందన్నారు. జాయింట్ అకౌంట్ ఓపెన్ చేయడం వల్ల వచ్చే ప్రయోజనం ఏమిటో రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు, తల్లిదండ్రులకు చెప్పాలన్నారు. 2019 నుంచి సంవత్సరానికి నాలుగు దఫాలుగా జగనన్న విద్యా దీవెన తల్లి ఖాతాలో జమ చేస్తామని చెప్పిన ప్రభుత్వం, ఏటా ఒక్కొక్క విడత పెండింగ్‌లో పెట్టడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందుల ఎదుర్కొం టున్నారన్నారని తెలిపారు. నాలుగేళ్లుగా విద్యా దీవెన, వసతి దీవెన దాదాపు రూ. 1600 కోట్లు పెండింగ్‌లో ఉన్న ప్పటికీ, వాటిని విడుదల చేయకుండా విద్యార్థుల పట్ల జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన బకాయి లను తక్షణమే విడుదల చేయాలన్నారు. తల్లితోపాటు విద్యార్థితో కూడిన జాయింట్ అకౌంట్ ఉండాలన్న నిబంధనల ఉత్తర్వులను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని శివారెడ్డి డిమాండ్ చేశారు.

తెలంగాణ ప్రజలకు కేసీఆర్, కేటీఆర్ క్షమాపణ చెప్పాలి

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి :ఎన్‌డీఏలో చేరిక, కేటీఆర్‌ను సీఎం చేయాలన్న అంశంపైన నాడు ప్రధాని మోదీ మాటలను ఖండించి, నేడు వాస్తవమేనని అంగీకరించిన తెలంగాణ సీఎం కేసీఆర్, ఆయనతో పాటు కేటీఆర్ తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణ డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ తనతో చేసిన వ్యాఖ్యలను నాడు తెలంగాణ పర్యటన సందర్భంగా మోదీ బయటపెట్టగా, ఆ వ్యాఖ్యలను కేటీఆర్ తీవ్రంగా ఖండించారని నారాయణ గుర్తుచేశారు. ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు వాస్తవమేనని తాజాగా ఇండియా టుడే ఇంటర్వ్యూలో కేసీఆర్ అంగీకరించారన్నారు. నాడేమో అలా అనలేదని బుకాయించి, నేడు అంగీకరించారని నారాయణ పేర్కొన్నారు. ఒకప్పుడు కేటీఆర్‌ను సీఎంగా చేద్దామని కేసీఆర్ తనను అడిగినట్లుగాను, కేంద్రంలోనూ సీట్ల వ్యవహారంపై చర్చించినట్లు మోదీ వ్యాఖ్యలను తాము అంతగా పరిగణనలోకి తీసుకోలేదన్నారు. ప్రధాని స్థాయిలో ఉన్న మోదీ సైతం అనధికారికంగా మాట్లాడిన వాటిని అలా చెప్పకూడదు కదా? అని తాము భావించామని అన్నారు. మోదీని అడిగిన మాట వాస్తవమైనప్పుడు అప్పుడే కేసీఆర్ స్పందించాల్సి ఉందని, తెలంగాణ రాష్ట్ర ప్రజలను ఎందుకు మభ్యపెడతారని నారాయణ ప్రశ్నించారు. దీని ఆధారంగా ఒక స్పష్టమైన తప్పును కేసీఆర్ చేశారన్నారు. ఇప్పటికైనా కేసీఆర్, కేటీఆర్ తెలుగు ప్రజలకు క్షమాపణ చెప్పాలని నారాయణ డిమాండ్ చేశారు.

గుండెకింది తడిని స్పృశించేదే అసలైన కవిత్వం

అధికార భాషా సంఘం అధ్యక్షులు పి.విజయబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : వేగం పెరిగిన నేటి కాలంలో సమాజాన్ని చదివే తీరిక ఎవరికీ వుండటం లేదని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షులు పి.విజయబాబు అన్నారు. స్థానిక ఠాగూర్ గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 11 గంటలకు మల్లెతీగ సాహిత్యసేవాసంస్థ ఆధ్వర్యంలో కొమ్మవరపు విల్సన్ రావు రచించిన 'నాగలి కూడా ఆయుధమే' కవితా సంపుటి ఆవిష్కరణ సభకు ముఖ్యఅతిథిగా విజయబాబు హాజరయ్యారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి మనిషీ పుస్తకాలు చదవడం నేర్చుకోవా లన్నారు. అందుకు గ్రంథాలయాల్ని ఉపయోగించుకోవాలన్నారు. కనీసం రోజుకు ఒక పేజీ అయినా చదవాలన్నారు. గుండెకింది తడిని స్పృశించే కవిత్వం నేటితరం కవుల నుండి ఆశిస్తున్నానన్నారు. అలాంటి కవిత్వమే సమాజంలో మార్పు తీసుకొస్తుందన్నారు. మహాకవి శ్రీశ్రీ కవిత్వాన్ని మనం ఇప్పటికీ చెప్పుకున్నట్టే ఐదు దశాబ్దాల తర్వాత కూడా మన కవిత్వం గురించి రేపటితరం చెప్పుకోవాలంటే శ్రీశ్రీ స్థాయిలో కవిత్వం రాయాలని నేటితరం కవులకు సూచించారు. సభకు అధ్యక్షత వహించిన విరసం అధ్యక్షులు అరసవిల్లి కృష్ణ, సుప్రసిద్ధ సాహితీవేత్తలు సాగర్ శ్రీరామకవచం, బంగార్రాజు కంఠ, సీనియర్ జర్నలిస్టు ఘంటా విజయ్ కుమార్ సభలో మాట్లాడారు. పుస్తకాన్ని అనిల్ డ్యాని సమీక్షించారు. కొమ్మవరపు విల్సన్ రావు తన స్పందనని తెలియజేశారు. కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ శ్రీమతి జమలాపూర్ణమ్మ, గ్రేడ్ వన్ గ్రంథాలయాధికారిణి కె.రమాదేవి కార్యక్రమంలో పాల్గొన్నారు. మల్లెతీగ కలిమిశ్రీ తొలుత అతిథుల్ని వేదికపైకి ఆహ్వానించగా కార్యక్రమాన్ని చొప్పా రాఘవేంద్రశేఖర్ నిర్వహించారు.

బైపీసీ స్ట్రీమ్ సీట్ల ఖరారు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ ఈఏపీసెట్-2023 (బైపీసీ స్ట్రీమ్)లో భాగంగా అగ్రికల్చర్, ఫార్మసీ తదితర కోర్సుల్లో ప్రవేశాలకు ఎంపికైన అభ్యర్థుల వివరాల్ని కన్వీనర్ ఖరారు చేశారు. ఏపీ ఈఏపీసెట్ వెబ్‌సైట్‌లో కళాశాలల వారీగా వివిధ కోర్సులకు ఎంపికైన అభ్యర్థుల కేటాయింపు లేఖలు అందుబాటులో ఉంచారు. 2023-24 విద్యా సంవత్సరానికి ఈ కౌన్సెలింగ్ ద్వారా బైపీసీ విద్యార్థులకు ఫార్మసీ, అగ్రికల్చర్, బయో టెక్నాలజీ, ఫుడ్ టెక్నాలజీ తదితర కోర్సులకు ప్రవేశాలు కల్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో వారికి సీట్లను కేటాయించారు. సీట్లకు ఎంపికైన అభ్యర్థులంతా ఈ నెల 21వ తేదీలోగా కళాశాలల్లో తమ పూర్తి వివరాలను అందజేయాలి. లేకుంటే వారి ప్రవేశాలు రద్దవుతాయి. ఇప్పటికే ఎంపీసీ స్ట్రీమ్‌లో భాగంగా ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తయింది. దాని తర్వాత బైపీసీ స్ట్రీమ్ వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ ఏడాది కూడా కౌన్సెలింగ్ నిర్వహణ జాప్యంతో విద్యార్థులు, తల్లిదండ్రులు అసౌకర్యానికి గురయ్యారు.

ప్రవీణ్ ప్రకాశ్‌కు జాతీయ ఎస్టీ కమిషన్ నోటీసు

విశాలాంధ్ర-అమరావతి: పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్‌కు జాతీయ ఎస్టీ కమిషన్ నోటీసు ఇచ్చింది. ఏడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. పాఠశాల విద్యాశాఖలో ఒప్పంద ఉద్యోగం వ్యవహారంతో పాటు మహిళా అభ్యర్థిని వేధిందించినట్లు శ్రీకాకుళం జిల్లా సారవకోటకు చెందిన పి.నిర్మల ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ నోటీసును జాతీయ ఎస్టీ కమిషన్ జారీ చేసింది.

రాష్ట్రంలో అరాచక, విద్వేష పాలన

ఎస్సీలకు మాట్లాడే హక్కులేకుండా చేస్తున్నారు

రాష్ట్ర ప్రభుత్వ తీరుపై దగ్గుబాటి పురందేశ్వరి ధ్వజం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రాష్ట్రంలో అరాచక, విద్వేషపూరిత పాలన కొనసాగుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ధ్వజమెత్తారు. విజయవాడ ఎ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం నిర్వహించిన ఎన్టీఆర్ జిల్లా మండల, పోలింగ్ బూత్, శక్తి కేంద్రాల సభ్యుల సమావేశంలో పురందేశ్వరి ప్రారంభోపన్యాసం చేశారు. రాష్ట్రంలో ఎస్సీలకు మాట్లాడే హక్కులేకుండా చేస్తున్నారని, ఎవరైనా ప్రభుత్వం పై గళం విప్పితే కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. అనేక ప్రాంతాల్లో వైసీపీ నాయకులు ఇసుకను దోచుకుంటూ కోట్లు పోగేసుకుంటున్నారని, అడిగిన వారిపై వ్యక్తిగత దూషణలు చేస్తూ వారిపైనే ఎస్సీ, ఎస్టీ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామంలో ఎస్సీ యువకుడు పురుగుమందు తాగిన ఘటనను పురందేశ్వరి ప్రస్తావిస్తూ హోంమంత్రి నియోజకవర్గంలోనే ఒక ఎస్సీ యువకుడు పురుగుల మందు తాగి చనిపోయాడని, దీనిపై ప్రభుత్వం ఏం సమాధానం చెబుతుందని ప్రశ్నించారు. దొమ్మేరులో ఎస్సీవర్గానికి చెందిన యువకుడు పురుగుమందు తాగిన ఘటనకు మీ సామాజిక యాత్ర ఏం సంకేతం ఇస్తోందో చెప్పాలని డిమాండ్ చేశారు. నా ఎస్సీ, నా ఎస్టీ అని చెప్పుకునే జగన్ ఆ కుటుంబానికి ఏమి న్యాయం చేశారని ప్రశ్నిస్తున్నానన్నారు. రాష్ట్రంలో ఇసుక మాఫియా నడుస్తోందని, రాజమహేంద్రవరం కడియం మండలంలో గోదావరి నదీ గర్భంలో అడ్డగోలుగా యంత్రాలతో ఇసుక తవ్వేస్తున్నారని, తాను స్వయంగా కార్యకర్తలతో వెళ్లి చూశానని తెలిపారు. ఏపీ రాజధాని అమరావతి అనే మాటకు బీజేపీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు క్యాపిటల్ గెయిన్ ఇస్తూ అరుణ్ జైట్లీ ఆనాడు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు.

కేసీఆర్ హ్యాట్రిక్ ఖాయం: మంత్రి హరీష్ రావు

విశాలాంధ్ర-హైదరాబాద్ : అధికారం కోసం ఎవ్వరు ఎన్ని కుట్రలు చేసినా ప్రజా బలం ఉన్న నాయకుడు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ హ్యాట్రిక్ సాధించడం ఖాయమని రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత జరిగిన అభివృద్ధి, ప్రజలకు అందిన సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ పార్టీ గెలుపునకు సహకరిస్తాయన్నారు. శనివారం బోధన్, ఆర్మూర్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గతంలో నిజాంసాగర్ చిట్టచివరి భూములకు నీళ్లు రావాలంటే కష్టంగా ఉండేదని, కానీ తాను ఇరిగేషన్ మంత్రిగా ఉన్నప్పుడు కెనాల్ లైనింగ్, ఆధునీకరణ కావాలని అడిగితే రూ.100 కోట్లను మంజూరు చేశానని గుర్తు చేశారు. గతంలో బోధన్ కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్ రెడ్డి ఇరిగేషన్ శాఖా మంత్రిగా ఉండి చేయలేని పనిని ఎమ్మెల్యేగా షకీల్ చేసి చూపించాడన్నారు. తాగు నీళ్లు ఇచ్చి, చిట్టచివరి ఆయకట్టు వరకు నిజాం సాగర్ నీళ్లను పారించామన్నారు. బోధన్-నిజామాబాద్ నాలుగు వరుసల రహదారిని రూ.30 కోట్లతో అభివృద్ధి చేశామని, అలాగే నవీపేటలో రూ.60 కోట్లతో పాలిటెక్నిక్ భవనాన్ని బీఆర్ఎస్ హయాంలో నిర్మించుకున్నామని చెప్పారు. తెలంగాణ రాక ముందు, వచ్చిన తర్వాత జరిగిన మార్పును ప్రజలు గమనించాలన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోని నమ్మొద్దని, ఇలాగే కర్నాటకలో హామీలిచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. అక్కడ కూడా 24 గంటల కరెంట్ ఇస్తామని చెప్పి కేవలం 3 గంటలే ఇస్తున్నారని దుయ్యబట్టారు. రైతు బంధు, రైతు బీమా, నిరంతర విద్యుత్, ధాన్యం కొనుగోలు చేసింది కేసీఆర్ మాత్రమే అని, అందువల్ల కాంగ్రెస్ మాయమాటలకు మోసపోవద్దని సూచించారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.200 పెన్షన్‌ను రూ.2 వేలు చేశారని, ఈ సారి గెలిపిస్తే రూ.5 వేలు చేస్తాడన్నారు. అలాగే బీఆర్ఎస్ గెలిస్తే బీజేపీ రూ.1200కి పెంచిన గ్యాస్ సిలిండర్‌ని రూ.400కే అందిస్తామన్నారు. మహిళల కోసం కేసీఆర్ ప్రత్యేకంగా సౌభాగ్యలక్ష్మి పథకం తెచ్చారని, రేషన్ షాపుల్లో సన్న బియ్యం పథకం, రైతు బంధు కింద కేసీఆర్ ఎకరాకు రూ.16 వేలు ఇస్తామంటే కాంగ్రెసోళ్లు రూ.15 వేలే ఇస్తమంటున్నరన్నారు. మరి మాట మీద నిలబడే కేసీఆర్‌ని నమ్ముతారా? జూటా మాటల కాంగ్రెసోళ్లను నమ్ముతారా అనే విషయాన్ని ప్రజలు ఆలోచించాలన్నారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోని ప్రతీ ఇంటికి తీసుకెళ్లి కాంగ్రెస్ మోసాన్ని ఎండగట్టాలన్నారు. కర్నాటక కాంగ్రెస్ నమూనా విఫలమైందని, ఇప్పటికే అక్కడ ఉచిత బస్సు ప్రయాణం అని చెప్పి బస్సులను ఆపేశారని, యువనిధి ఇంకా మొదలేకాలేదు, ఉచిత విద్యుత్ అని ఊదరకొట్టి రైతులను ఆగం పట్టించారన్నారు. ఉచితాలకు నిధులు లేక స్కాలర్ షిప్పుల్లో కోత పెట్టారని ఆరోపించారు. కాంగ్రెస్‌కు ఓటేసి ఆగమై పోయినమని అక్కడి ప్రజలు మొత్తుకుంటున్నారని చెప్పారు. తెలంగాణ ప్రజలు అప్రమత్తంగా లేకపోతే విద్యుత్ కోతల పాత రోజులు మళ్లీ వస్తాయన్నారు. కాంగ్రెసోళ్లది సుతిలేని సంసారం అని అర డజను మంది ముఖ్యమంత్రి అభ్యర్థులు ఆ పార్టీలో ఉన్నారని, కుర్చీల కొట్లాట ఎక్కువ, ప్రజల పని తక్కువ అంటూ ఎద్దేవా చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే అని కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోందని, అదే నిజమైతే అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను బీజేపీకి చెందిన గవర్నర్ ఎందుకు పెండింగ్‌లో పెడతారన్నారు. కేసీఆర్ ఉన్నంతవరకు తెలంగాణ రాష్ట్రం, బీఆర్ఎస్ పార్టీ సెక్యులర్‌గా ఉంటుందని తెలిపారు.

బీసీ సీఎం కావాలంటే బీజేపీ గెలవాలి

ఐదేళ్లలో 2.5 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం

బీఆర్ఎస్‌కు వీఆర్ఎస్ ఇచ్చే సమయం ఆసన్నమైంది : అమిత్ షా

విశాలాంధ్ర-హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో బీసీ నేత సీఎం కావాలంటే బీజేపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. రాష్ట్రంలో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని ఈ ఘనత కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకే దక్కుతుందని తెలిపారు. ఇప్పటికే బీసీని ప్రధాన మంత్రిని చేసిన ఘనత బీజేపీకే ఉందని అన్నారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా అయన జోగులాంబ గద్వాల, నల్గొండ, వరంగల్ సభలలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బీసీలకు చేసిందేమీలేదని దుయ్యబట్టారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే అది డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని భరోసా ఇచ్చారు. తెలంగాణ ఉద్యమ సమయంలో దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని చెప్పిన కేసీఆర్ ఆ తర్వాత తానే గద్దెనెక్కి దళితులను మోసం చేశారన్నారు. చివరకు వారికి మూడెకరాల భూమి ఇస్తామని చెప్పి అది కూడా ఇవ్వలేదన్నారు. ఈ ప్రభుత్వం పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందన్నారు. ప్రభుత్వం గొప్పగా చెప్పుకున్న కాళేశ్వరాన్ని కేసీఆర్ ఏటీఎంగా మార్చుకున్నారని ఆరోపించారు. ఉద్యోగాల పేరిట యువతను మోసం చేశారని టీఎస్‌పీఎస్‌సీ నుంచి 7 నోటిఫికేషన్లు ఇచ్చినట్టే ఇచ్చి, ప్రశ్నపత్రాలను లీక్ చేశారని మండిపడ్డారు. అలాంటి ఘటనల వల్ల ప్రవల్లిక, అహ్మద్ వంటి యువత ఆత్మహత్య చేసుకున్నారని, అవి ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే అన్నారు. బీజేపీకి అవకాశమిస్తే 5 ఏళ్లలో రెండున్నర లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను పారదర్శకంగా కల్పిస్తామని తెలిపారు. జోగులాంబ మహాశక్తి పీఠాన్ని ప్రముఖ తీర్థస్థలంగా అభివృద్ధి చేసేందుకు రూ.80 కోట్లు కేటాయిస్తామని అమిత్ షా హామీ ఇచ్చారు. బీఆర్ఎస్‌కు వీఆర్ఎస్ ఇచ్చే సమయం ఆసన్నమైందని, బూటకపు హామీలు ఇవ్వడంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రపంచ రికార్డు సృష్టించిందంటూ ధ్వజమెత్తారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథలో భారీగా అవినీతి జరిగిందని ఆరోపించారు. గుర్రంగడ్డ, గట్టు రిజర్వాయర్‌ను కేసీఆర్ నిర్మించలేదన్నారు. రైతులకు కనీస హక్కులు ఇవ్వకుండా అన్యాయం చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు 2జీ, 3జీ, 4జీ పార్టీలని, తెలంగాణలో ఈ పార్టీలకు విముక్తి కల్పించాలని పిలుపునిచ్చారు. బీసీలకు కాంగ్రెస్, బీఆర్ఎస్ అనుకున్న స్థాయిలో టికెట్లు ఇవ్వలేదని మండిపడ్డారు.

మద్య నిషేధమంటూ రూ.2 లక్షల కోట్లు పిండారు

సీఎం జగన్‌పై టీడీపీ నేత అచ్చెన్నాయుడు మండిపాటు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మద్యనిషేధం విధిస్తామని ప్రజలను నమ్మించి నాలుగున్నరేళ్లలో దాదాపు 2 లక్షల 10 కోట్ల రూపాయల పేదల కష్టార్జితాన్ని జలగల్లా పిండారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు మండిపడ్డారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి నోరు పెద్ద అబద్ధాల పుట్ట. ఆయన నోటి నుంచి అబద్ధం తప్ప మరోటి రాదు. ప్రజలను మాయమాటలతో మోసగించడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. గతంలో ప్రతిపక్ష నేతగా టీడీపీ ప్రభుత్వంపై, చంద్రబాబు పాలనపై విష ప్రచారం చేసి, లెక్కకు మిక్కిలి హామీలిచ్చిన జగన్ రెడ్డి... అధికారంలోకి వచ్చాక వాటిని తుంగలో తొక్కి, తన చేతగానితనం, అసమర్థతను కప్పిపుచ్చేందుకు టీడీపీపై, చంద్రబాబుపై నీతిమాలిన ప్రచారం చేస్తున్నాడని అచ్చెన్నాయుడు ధ్వజమెత్తారు. తెలుగుదేశం ప్రభుత్వంలో బెల్టు షాపులు ఉన్నాయన్న ఈ పెద్దమనిషి, తన పాలనలో ఏకంగా మద్యాన్ని డోర్ డెలివరీ చేసే స్థాయికి మద్యం విక్రయాలు పెంచాడు. సినిమా హాళ్ల వద్ద బ్లాక్ టికెట్లు అమ్మే దానికంటే దారుణంగా జగన్ రెడ్డి ఇంటింటికీ తన పార్టీ వలంటీర్లతో నాసిరకం మద్యం సరఫరా చేయిస్తున్నాడు. రాష్ట్రంలో జరుగుతున్న నాసిరకం మద్యం వ్యాపారానికి కర్త... కర్మ... క్రియా జగన్ రెడ్డేనని ఆయన ఆరోపించారు. కల్తీ మద్యం తయారు చేయిస్తూ అమ్ముతున్న నాసిరకం మద్యం వల్ల రాష్ట్రంలో 35 లక్షల మంది పేదలు తమ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతుకుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నోరుతెరిస్తే జగన్ రెడ్డి నా ఎస్సీ... నా ఎస్టీ... నా బీసీ... నా మైనారిటీలు అంటూ పేదల జీవితాలను తన ధనదాహానికి బలిచేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ ప్రభుత్వంలో ఐదేళ్లలో మద్యం అమ్మకాలపై రూ.50 వేల కోట్లు వస్తే... జగన్ రెడ్డి నాలుగేళ్ల పాలనలోనే రూ.2.10 లక్షల కోట్లు వచ్చాయన్నారు. అధిక ధరకు నాసిరకం మద్యం అమ్మడంతో పాటు దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సిగ్గు, శరం వదిలేసి బేవరేజేస్ కార్పొరేషన్ ద్వారా మద్యంపై వచ్చే ఆదాయాన్ని 15 ఏళ్లు తాకట్టుపెట్టి రూ.30 వేల కోట్ల అప్పులు తెచ్చి, ఏ ప్రభుత్వం వచ్చినా మద్యం ధరలు తగ్గించే వీలులేకుండా మద్యం అమ్మకాలను తన అప్పుల చట్రంలో ఇరికించాడన్నారు. ఎన్నికల మేనిఫెస్టో తనకు బైబిల్ అన్న జగన్ రెడ్డి, ప్రజలకు ఇచ్చిన హామీల్లో జగన్ 30 శాతం కూడా నెరవేర్చలేదన్నారు. ప్రజలు ఈ వాస్తవాలన్నీ గ్రహించి అప్రమత్తం కావాలని, ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా జగన్ రెడ్డిని, వైసీపీ ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలపాలని అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు.

సంపాదకీయం

పేచీకోరు గవర్నర్

తమిళనాడు ప్రభుత్వానికి, ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవికి మధ్య వివాదం ముదిరి పాకాన పడుతోంది. శాసనసభ ఆమోదించిన బిల్లులకు సమ్మతి తెలియజేయకుండా తాత్సారం చేయడం తమిళనాడు గవర్నర్‌కు అలవాటైపోయింది. ఆ రకంగా ప్రజలెన్నుకున్న ప్రభుత్వం విధి నిర్వహణకు అడ్డు తగలడానికి అవకాశం కోసం ఎదురు చూస్తూ ఉంటారు. చట్టసభ ఆమోదించిన బిల్లుల మీద గవర్నర్ సంతకం చేయకపోతే అవి చట్టాలు కావు. తమ రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి శాసనసభ ఆమోదించిన బిల్లుల మీద సంతకాలు చేయకుండా అట్టి పెట్టుకుంటున్నందువల్ల ఇబ్బంది ఎదురవుతోందని ఫిర్యాదు చేస్తూ, ఆ బిల్లులను ఆమోదించాల్సిందిగా గవర్నరును ఆదేశించాలని అభ్యర్థిస్తూ ఇటీవలే స్టాలిన్ నాయకత్వంలోని డీఎంకే ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ కేసు గత పదవ తేదీన సుప్రీంకోర్టు ఎదుట విచారణకు వచ్చింది. అందువల్ల గవర్నర్ ఒకేసారి తన దగ్గర దాదాపు మూడేళ్లుగా మూలుగుతున్న బిల్లులతో సహా మొత్తం పది బిల్లులను శాసనసభకు వెనక్కు వంపించారు. శాసనసభ ఆమోదించిన బిల్లులపై గవర్నరుకు భిన్నాభిప్రాయమో, అభ్యంతరాలో లేదా తాను చేయదలచుకున్న సూచనలో ఉండొచ్చు. అలాంటప్పుడు గవర్నర్ ఆ బిల్లుల మీద ఎందుకు సంతకం చేయడంలేదో తెలియజేస్తూ వాటిని వెనక్కు పంపొచ్చు. అప్పుడు శాసనసభ వాటిని మళ్లీ పరిశీలించి గవర్నర్ చేసిన సూచనలను అంగీకరించనూవచ్చు. లేకపోతే మళ్లీ అవే బిల్లులను అదే రూపంలో ఆమోదించి గవర్నర్‌కు తిరిగి పంపవచ్చు. అప్పుడు గవర్నరుకు ఉన్న మార్గాలు రెండే. మొదటిది ఆ బిల్లుల మీద సంతకం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించడం లేదా ఆ బిల్లుల మీద సంతకం చేయడం తనకు ససేమిరా కుదరదు అనుకున్నప్పుడు రాజీనామా చేసి వెళ్లిపోవడం. అసలు ఈ సమస్యంతా ఎందుకు వస్తోందంటే శాసనసభ ఆమోదించిన బిల్లుల మీద గవర్నరు సంతకం చేయడానికి నిర్ణీత గడువు ఏమీ లేదు. తమకు నచ్చనప్పుడు బిల్లుల మీద సంతకం చేయకుండా జాప్యం చేస్తూ ఉంటారు. నిరవధికంగా బిల్లులను ఆమోదించకుండా ఉండే హక్కు గవర్నరుకు ఉందని రాజ్యాంగంలో ఎక్కడా లేదు. ఈ కేసు సుప్రీంకోర్టు విచారణలో ఉంది కనక తదుపరి విచారణ జరిగే నాటికి ఇంతకాలం తొక్కిపెట్టిన బిల్లులను గవర్నర్ ఆర్ఎన్ రవి టోకున తిప్పి పంపారు. దీనికి స్టాలిన్ ప్రభుత్వం స్పందించిన తీరూ అపూర్వమైందే. శనివారం ఆ బిల్లులన్నింటినీ మళ్లీ ఏకగ్రీవంగా ఆమోదించి గవర్నరుకు పంపించింది. ఇప్పుడు గవర్నరుకు ఆ బిల్లుల మీద సంతకం చేయడం తప్ప గత్యంతరం లేదు. రెండోసారి మళ్లీ ఆ బిల్లులను వెనక్కు పంపే అవకాశం లేదు. గవర్నర్ బిల్లులు ఆమోదించకపోవడం క్రియా రాహిత్యం, జాప్యం చేయడమని, రాజ్యాంగ నిర్దేశాలను పాటించకపోవడమని ప్రకటించాలని తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టుకు పెట్టుకున్న అర్జీలో తెలియజేసింది. గత పదవ తేదీన విచారణ జరిగినప్పుడు ఈ అంశంపై సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వం అభిప్రాయం తెలియజేయాలని కోరింది. కేంద్ర ప్రభుత్వం అభిప్రాయం ఎలా ఉంటుందో కానీ గవర్నర్ ఆ బిల్లులను ఆమోదించకుండా ఉండే అవకాశం ఇక ఎంతమాత్రం లేకుండా స్టాలిన్ ప్రభుత్వం అవే బిల్లులను అదే రూపంలో మళ్లీ గవర్నరుకు పంపించింది.

గవర్నర్ ఇంతకాలం సంతకం చేయకుండా తిప్పి పంపిన బిల్లుల్లో 2020లో, 2023లో ఆమోదించినవి రెండేసి ఉన్నాయి. మరో ఆరు బిల్లులను గత ఏడాదే శాసనసభ ఆమోదించిన తరవాత గవర్నర్ సంతకం కోసం పంపించారు. ఈ మూడేళ్ల కాలంలో పంపిన పది బిల్లుల మీద సంతకం ఎందుకు చేయలేదో గవర్నర్ చెప్పలేదు. ఆయన అభ్యంతరాలు, సూచనలు, సలహాలు ఉంటే తెలియజేయడానికి అవకాశం ఉంది. కానీ కారణం లేకుండా తిప్పి పంపడం రాజ్యాంగ విరుద్ధమైన చర్యే. బీజేపీయేతర పార్టీలు అధికారంలో ఉన్న అనేక రాష్ట్రాల గవర్నర్లు ఏదో ఓ రూపంలో రాష్ట్ర ప్రభుత్వాలకు అడ్డంకులు కల్పిస్తూనే ఉన్నారు. వీరందరినీ ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నియమించిందన్న అంశాన్ని ప్రత్యేకంగా గమనించాలి. స్టాలిన్ ప్రభుత్వానికీ, గవర్నరుకు రెండేళ్లుగా వివాదం కొనసాగుతూనే ఉంది. ఇంతకుముందు కూడా తమిళనాడుకు 'నీట్' పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలని శాసనసభ బిల్లు ఆమోదించి పంపితే గవర్నర్ చాలాకాలం తాత్సారం చేశారు. ఆ బిల్లునే మళ్లీ ఆమోదించి పంపితే తప్ప గవర్నర్ దానిని రాష్ట్రపతికి పంపలేదు. ప్రతి ఏడాది ఆరంభంలో శాసనసభ సమావేశం జరిగినప్పుడు గవర్నర్ ప్రసంగించడం ఆనవాయితీ. అయితే ఆ ప్రసంగం గవర్నర్ ఇష్టానుసారం చేయగలిగింది కాదు. ప్రభుత్వం ఆ ప్రసంగ పాఠం తయారు చేసి పంపితే గవర్నర్ దాన్ని సభలో చదవాలి. కానీ ఆర్ఎన్ రవి ఆ ప్రసంగ పాఠంలో ఉన్న అంబేద్కర్, పెరియార్, కామరాజ్, అన్నాదురై, కరుణాధి పేర్లు చదవకుండా దాటేశారు. అయితే ఆయన చదవకుండా వదిలేసిన ప్రసంగం కాకుండా ప్రభుత్వం రూపొందించిన ప్రసంగమే రికార్డులలోకి ఎక్కాలని శాసనసభ తీర్మానం ఆమోదించింది. సాధారణంగా విశ్వవిద్యాలయాలకు గవర్నర్లు చాన్సలర్లుగా ఉంటారు. వైస్ చాన్సలర్లను నియమించడానికి గవర్నరుకు ఉన్న అధికారాలకు కత్తెర వేస్తూ చాలా రాష్ట్రాలు చట్టాలు తీసుకొచ్చాయి. గతంలో గుజరాత్‌లో కొంతకాలం ముఖ్యమంత్రినే విశ్వవిద్యాలయాల చాన్సలర్‌గా నియమించారు. విశ్వభారతి విశ్వవిద్యాలయానికి ప్రధానమంత్రి మోదీ చాన్సలరుగా ఉన్నారు. తమిళనాడులో కూడా ఇలాగే గవర్నరును కాకుండా ముఖ్యమంత్రిని చాన్సలర్‌గా నియమించాలని స్టాలిన్ ప్రభుత్వం నిర్ణయించింది. సహజంగానే ఇది గవర్నర్ ఆర్ఎన్ రవికి మింగుడు పడలేదు. చాన్సలర్ హోదాలో విశ్వవిద్యాలయ వైస్‌చాన్సలర్లను గవర్నర్ నియమించినా ఎవరిని నియమించాలన్న సిఫార్సు మాత్రం రాష్ట్ర ప్రభుత్వమే చేస్తుంది. కొన్ని సందర్భాలలో గవర్నర్లు ఈ విషయంలో పేచీకి దిగారు. ఇప్పుడు ఆర్ఎన్ రవి చేసిన పనీ అదే. గవర్నర్‌కు కొద్దిపాటి విచక్షణాధికారాలు ఉన్నమాట నిజమే. కానీ చాలా విషయాల్లో రాష్ట్ర మంత్రివర్గ సిఫార్సు మేరకు నడుచుకోవలసిందే. అలా నడుచుకోకపోవడం అంటే ప్రజలెన్నుకున్న ప్రభుత్వాన్ని కించపరచడమే. గవర్నర్ల నడవడికను తప్పు పడుతూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టులో దాఖలు చేసినట్టే అనేక రాష్ట్రాలు అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. గవర్నర్ల తీరుపై సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వ అభిప్రాయం కోరింది. ఆ అభిప్రాయం వెలువడితే తప్ప కేంద్రం వైఖరేమిటో తెలియదు. ఈ లోగా మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత నియమితులైన చాలామంది గవర్నర్లు రాష్ట్ర ప్రభుత్వాలకు అడుగడుగునా ఆటంకాలు కలిగిస్తున్నారు. రాజ్యాంగాన్ని బాహాటంగా ఉల్లంఘిస్తూ ఆర్ఎస్ఎస్ కార్యకర్తలుగా వ్యవహరించడానికి అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు.

వేగవంతమవుతున్న భూతాపం

డా. యం.సురేష్ బాబు

భూమి "ప్రాముఖ్యమైన సంకేతాలు" మానవ చరిత్రలో అధ్వానంగా ఉన్నాయని అంతర్జాతీయ శాస్త్రవేత్తల బృందం హెచ్చరించింది. అంటే గ్రహంమీద జీవితం ప్రమాదంలో ఉంది. వాతావరణ సంక్షోభాన్ని ట్రాక్ చేయడానికి వారు ఉపయోగించే 35 గ్రహాల కీలక సంకేతాలలో 20 రికార్డుస్థాయిలో ఉన్నాయని పేర్కొన్నారు. గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలు, ప్రపంచ ఉష్ణోగ్రత, సముద్ర మట్టం పెరుగుదల సూచికలలో మానవ, పశువుల జనాభా సంఖ్య కూడా ఉంది. అంతర్జాతీయంగా గాలి ఉష్ణోగ్రత, సముద్ర ఉష్ణోగ్రత, అంటార్కిటిక్ సముద్రపు మంచు విస్తీర్ణం సహా వాతావరణ రికార్డులు 2023లో అత్యధికంగా నమోదయ్యాయి. ముఖ్యంగా ఉపరితల ఉష్ణోగ్రత జూలైలో అత్యధికంగా నమోదైంది. 100,000 సంవత్సరాలలో గ్రహం అత్యంత వేడిగా ఉంటోంది. కెనడాలో కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలను ఉత్పత్తిచేసే అసాధారణమైన అడవి మంటల సీజన్‌ను శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇవి మొత్తం ఒక బిలియన్ టన్నుల కార్బన్ డయాక్సైడ్‌ని కలిగి ఉన్నాయి. ఇది ప్రపంచంలో ఐదవ అతిపెద్ద కాలుష్యకారకమైన జపాన్ మొత్తం వార్షిక ఉత్పత్తికి సమానం. మానవ శ్రేయస్సుకు ప్రాధాన్యతనిచ్చే అధిక ఉద్గారాలను తగ్గించే ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పరివర్తనను పరిశోధకులు కోరారు. 2019లో నమోదైన 50శాతం ప్రపంచ ఉద్గారాలకు టాప్ 10శాతం ఉద్గారాలు కారణమని తెలిపారు. అమెరికాలోని ఒరెగాన్ స్టేట్ యూనివర్సిటీ నివేదిక రచయిత డాక్టర్ క్రిస్టోఫర్ వోల్ఫ్ మాట్లాడుతూ "మానవత్వం సురక్షితంగా ఉండాలంటే, ఇవ్వగలిగే దానికంటే ఎక్కువ భూమి నుంచి తీసుకోవడం వలన కలిగే సమస్యలను పరిష్కరించే చర్యలు చేపట్టకుండా మేము మా మార్గంలో ఉన్నాము. సహజ, సామాజిక, ఆర్థిక వ్యవస్థలు, భరించలేని వేడి, ఆహారం, మంచినీటి కొరతతో ప్రపంచం తీవ్ర పరిణామాలను ఎదుర్కొంటోంది. "2100 నాటికి 3 బిలియన్ల నుండి 6 బిలియన్ల మంది ప్రజలు భూమి నివాసయోగ్యమైన ప్రాంతం వెలుపల తమను తాము కనుగొనవచ్చు, అంటే వారు తీవ్రమైన వేడి, పరిమిత ఆహార లభ్యత, పెరిగిన మరణాల రేటును ఎదుర్కొంటారు." వాతావరణ మార్పులతో పోరాడుతున్న మానవాళికి సంబంధించి నివేదించడానికి మేము తక్కువ పురోగతిని కనుగొన్నాము అని ఓరెగాన్ స్టేట్ యూనివర్సిటీ ప్రొఫెసర్ విలియం రిప్పల్ పేర్కొన్నారు. "వాతావరణ వాస్తవాలను తెలియజేయడం విధాన సిఫార్సులు చేయడం మా లక్ష్యం. ఏదైనా అస్తిత్వ ముప్పు గురించి మానవాళిని అప్రమత్తం చేయడం, తగిన చర్య తీసుకోవడం శాస్త్రవేత్తల నైతిక విధి. 15,000 మంది శాస్త్రవేత్తలచే ఆమోదించిన 2019 నివేదిక నవీకరణ భాగంగా "అనేక దశాబ్దాలుగా కొనసాగుతున్న మానవ కార్యకలాపాలవల్ల సంభవించే తీవ్రమైన వాతావరణ పరిస్థితులద్వారా గుర్తించిన భవిష్యత్తు గురించి శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. "గ్రహ వ్యవస్థలను ప్రమాదకరమైన అస్థిరతలోకి నెట్టివేస్తున్నాము"అని యూనివర్శిటీ ఆఫ్ ఎక్సెటర్ ప్రొఫెసర్ టిమ్ లెంటన్ ఇలా అన్నారు: "ఈ రికార్డు తీవ్రతలు తమలో తాము ఆందోళన కలిగిస్తాయి, అవి కోలుకోలేని నష్టాన్ని కలిగించి, వాతావరణ మార్పులను మరింత వేగవంతంచేసే ప్రమాదంలో ఉన్నాయి. 'క్లైమేట్ టిప్పింగ్ పాయింట్ల క్యాస్కేడ్‌ను నిరోధించడానికి మనం చేయవలసింది చాలఉంది. మన సమాజాలు ఆర్థిక వ్యవస్థలలో సానుకూల చిట్కాలు గుర్తించడం, ప్రేరేపించడం, స్థిరమైన భవిష్యత్తుకు వేగవంతమైన, న్యాయమైన పరివర్తనను నిర్ధారించడం." "2023లో జరిగిన విపరీతమైన వాతావరణ సంఘటనల క్రూరత్వంతో దిగ్భ్రాంతికి గురయ్యాము. సెప్టెంబర్ మధ్య నాటికి, 38 రోజులు ప్రపంచ సగటు ఉష్ణోగ్రతలు పారిశ్రామిక పూర్వ స్థాయిల కంటే 1.5సెంటీగ్రేడ్ కంటే ఎక్కువగా ఉన్నాయని నివేదిక పేర్కొంది. ఇది వాతావరణ సంక్షోభాన్ని పరిమితం చేయడానికి ప్రపంచ దీర్ఘకాలిక లక్ష్యం. ఈ ఏడాది వరకు ఇలాంటి రోజులు చాలా అరుదుగా ఉండేవని పరిశోధకులు తెలిపారు. శాస్త్రవేత్తలు సిఫార్సుచేసిన ఇతర విధానాలలో శిలాజ ఇంధన సబ్సిడీలను తొలగించడం, అటవీ రక్షణ పెంపుదల, సంపన్న దేశాల్లో మొక్కల ఆధారిత ఆహారాలవైపు మళ్లడం, కొత్త బొగ్గు ప్రాజెక్టులను ముగించడానికి, చమురు, గ్యాస్ వినియోగాన్ని దశలవారీగా తగ్గించడానికి అంతర్జాతీయ ఒప్పందాలను అనుసరించడం వంటివి ఉన్నాయి. "స్వచ్ఛంద కుటుంబ నియంత్రణద్వారా సంతానోత్పత్తి రేటు నియంత్రణకు, స్త్రీలు, బాలికల విద్య హక్కులకు మద్దతు ఇవ్వడం ద్వారా లింగ న్యాయం, మానవ జనాభా స్థిరీకరణకు మేము పిలుపినిస్తాము" అని పేర్కొన్నారు.

వాతావరణ అత్యవసర పరిస్థితిపై మన దృక్పథాన్ని కేవలం ఒక పర్యావరణ సమస్యల నుండి దైహిక, అస్తిత్వ ముప్పుగా మార్చాలి. పర్యావరణ సంక్షోభం ఒక కోణాన్ని మాత్రమే సూచిస్తుంది. ఉదా: జీవవైవిధ్య నష్టం, మంచినీటి కొరత, కరోనా మహమ్మారి, 2023లో కర్బన ఉద్గారాల ప్రాథమిక అంచనా 1శాతం పెరిగి మరో రికార్డుస్థాయికి చేరుకుందని గ్లోబల్ కార్బన్ ప్రాజెక్ట్ వద్ద డాక్టర్ గ్లెన్ పీటర్స్ హెచ్చరించారు.

ప్రజాసైన్స్ వేదిక అధ్యక్షులు

వజ్రాయుధంలాంటి కవి ఆవంత్స సోమసుందర్

ఆచార్య ఎన్ ఈశ్వర రెడ్డి

జీవితాన్ని మొత్తానికి మొత్తంగా సాహిత్యానికి అర్పించిన కవి, విమర్శకుడు, అనువాదకుడు, నాటక కర్త, కథకుడు ఆవంత్స సోమసుందర్ (నవంబరు 18,1924 - ఆగష్టు 12,2016). బహుముఖ ప్రజ్ఞాశాలిగా శతాధిక గ్రంథకర్తగా ఆయన చేసిన సాహితీసేవ అనన్యం. వృత్తి, ప్రవృత్తి రెండూ సాహిత్యమే కావడంవల్ల ఆయన నిరంతర అభ్యాసిగా, సృజనశీలిగా తనకంటూ ఓ ప్రత్యేకతను సంపాదించుకున్నారు. శ్రీశ్రీ, నారాయణబాబు,ఆరుద్ర, దాశరథి, రమణారెడ్డి మొదలైన మొదటితరం అభ్యుదయ కవుల్లో సోమసుందర్ ఒకరు. స్వాతంత్రోద్యమకాలంలో బ్రిటిష్ వారి దౌర్జన్యానికి గురైన సోమసుందర్, వారికి వ్యతిరేకంగా గొంతును సవరించుకోవడం ప్రారంభించాడు. 'ఒక వ్యక్తి సాంఘిక జీవితమే అతని చైతన్యాన్ని నిర్ణయిస్తుంది' అన్న కారల్ మార్క్స్ మాటలు పొల్లుపోనట్టు సోమసుందర్ చుట్టూ ఉన్న సాంఘిక సామాజిక జీవితమే అతనిలో ఉద్యమ గొంతుకు పునాదులేశాయి.

ఆ అణచివేతే ఆయనను అభ్యుదయ కవిగా మార్చింది. అభ్యుదయ సాహిత్య ఉద్యమం బలోపేతం కావడానికి కారణ కర్తను చేసింది. నిజాం పైశాచిక నిర్బంధాల నుంచి తెలుగుజాతిని విముక్తం చేయడానికి జరుగుతున్న పోరాటానికి తానూ ఒక ఆయుధమై ప్రభవించాడు. 'వజ్రాయుధం' పేరుతో ఆయన రాసిన కవిత్వం ఎంతోమందిని ప్రభావితం చేసింది. "కదలండి కదలండి కదలి పోరాడండి. తెలుగు వీరుడు మరణ మెరుగడని చాటండి. "పిరికి వానికి వేయి చావులని తెలపండి. పోరండి పోరండి బ్రతుకుకై, పోరండి పుడమికై, పోరండి స్వేచ్ఛకై" అంటూ తెలుగువారిలో ఉద్యమ స్ఫూర్తిని నింపిన గొప్పకవి సోమసుందర్. 'ఖబర్దార్ ఖబర్దార్ నిజాం బాదుషా హే! బానిసత్వ విముక్తికై, రాక్షసత్వ నాశముకై, హిందూ ముస్లిం పీడిత శ్రమజీవులు ఏకమైరి, ...నైజాం కీచకుడా! నీ పీచ మణచ ప్రజలంతా ఒక పిడికిట, ఒక గొంతుక, ఒక మ్రోతై ధ్వనిస్తారు. మృతవీరుల స్మరిస్తారు. నవయోధుల సృజిస్తారు' అంటూ చైతన్యాన్ని, నమ్మకాన్ని తెలంగాణ పోరాటవీరుల్లో రేకెత్తించాడు. సోమసుందర్ రాసిన కవిత్వం స్థానిక, దేశీయ, అంతర్జాతీయ స్థాయిలోని సమస్యలను వస్తువుగా స్వీకరించింది. సోమసుందర్ క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొనడంవల్ల తనకు జాతీయ, అంతర్జాతీయ సమస్యలు ఆకళించుకునే అవకాశం వచ్చిందని తనే రాసుకున్నాడు. పిఠాపురంలో కమ్యూనిస్టుపార్టీ ఆఫీసు అప్పటికే ఉండడంవల్ల, తను కూడా క్రియాశీల కార్యకర్తగా అందులో పని చేశాడు. దాని నిర్వహణకయ్యే ఖర్చుని తానే భరించడానికి నిర్ణయించుకున్నాడు. అంతేగాక రాంషా అనే మిత్రుడి సాయంతో సొంత ప్రెస్ ప్రారంభించి అభ్యుదయ కవిత్వ సేవకు పూనుకున్నాడు.

ప్రభుత్వ ఆంక్షలు ముళ్ళ కంచెల్లా అడ్డుపడుతున్నా 'వజ్రాయుధాన్ని' ముద్రించాడు. అప్పటికి శ్రీ శ్రీ మహాప్రస్థానం పుస్తక రూపంలో రాలేదు. 1949 మార్చి 5న వజ్రాయుధం విడుదలైంది. కావ్యాన్ని దాశరథి, రమణారెడ్డి, ఆరుద్ర, అనిశెట్టి మొదలైన సమదర్శకులకు అందరికీ పంచి వాళ్ళ కావ్యాలను కూడా అచ్చేయమని ప్రోత్సహించాడు. ఆరుద్ర త్వమేవాహాన్ని సోమసుందర్ తన ఖర్చుతో అచ్చేయించాడు. ఆ



ఉత్సాహంతోనే అనిశెట్టి 'అగ్ని వీణ', 'దాశరథి', 'అగ్ని ధార', 'రమణారెడ్డి', 'అడవి' కవితా సంపుటాలు వెలుగు చూశాయి. ప్రారంభదశలోనే అభ్యుదయ సాహిత్య ఉద్యమానికి సోమసుందర్ గొప్ప ఊపు నిచ్చాడు. 'సామ్యవాదం, కమ్యూనిజం ఆయన స్వప్నాలు'. వాటినిమాత్రం వదలడానికి ఏ దశలోనూ సిద్ధపడలేదు. తన కవితా జీవితమంతా సామ్యవాద ఆదర్శాలతోనే సాగింది. కాహళి, గోదావరి జలప్రళయం, రక్తాక్షి మేఘరంజని, సోమరసం సుందరకాండ, మిణుగురులు, అనల కిరీటం, వెన్నెలలో కోనసీమ, రాలిన ముత్యాలు, మా ఊరు మారింది, ఆగతానికి శుభారంభం, బృహత్కావ్యాలు, ఒక్క కొండలో వేయి శిల్పాలు, ఆంగ్లసీమలో ఆమని వీణలు, గంధ మాదనం, చేతావని, దోనాపాల, రక్ష రేఖ, మనస్సంగీతం, హృదయంలో హిరోషిమా, చిన్మయలహరి, జీవనలిపి సీకింగ్ మై బ్రోకెన్ వింగ్స్ మొదలైన కవితా సంపుటాలు ఆయన ఆలోచనకు, శ్రమకు సాక్ష్యం చెబుతాయి. సోమసుందర్ కథలు, మంది-మనిషి నాటకం, బుద్ధదేవ్ బోస్, లియోనార్డో దావిన్సీ, హంసధ్వని, కాజీనజ్రుల్ ఇస్లామ్, కాళిదాసు రామకథ, షెల్లీ జీవితం వంటి ప్రత్యేక రచనలు, రుధిర జ్యోతిర్దర్శనం, జాతికి జ్ఞాననేత్రం, కవిత్వం కాలాతీత కాంతిరేఖ, ఆధునిక కావ్య ప్రకాశిక, అమృత వర్షిణి, సాహిత్యంలో సంశయ కల్లోలం, అక్షర సమార్చన, ఆ తరం కవితా తరంగాలు, నారాయణ చక్రం, గోపుర దీపాలు, గురజాడ గురుత్వాకర్షణ, శరచ్చంద్రిక, పురిపండా ఎత్తిన పులిపంజా, నూరుశత్తులు, సైకత తీరంలో సాగర ఫేనం, నగరం నుంచి గగనం దాకా మనిషి, గవాక్షంలో అంతరిక్షం, మొదలైన విమర్శా గ్రంథాలు, కలలు కన్నీళ్ళు, కెరటాలు - కిరణాలు స్వీయ అనుభవ సంపుటులు ఆయన కలం నుండి రూపుదిద్దుకున్నవే.

మనిషిని మించిన దేవుడు లేడనే సత్యాన్ని, శ్రమను మించిన సౌందర్యం లేదనే తత్వాన్ని, త్యాగానికి మించిన తృప్తి ప్రపంచంలోలేవని సోమసుందర్ తన జీవితంలోనూ, సాహిత్యంతోను నిరూపించి చూపాడు. తన గమనం పొడవునా ఆశను ఒక దీపంలా వెలిగించుకున్నాడు. సంప్రదాయం తగిలించిన ఇనుప గొలుసులు తెంచేశాడు. కనిపించని స్వర్గ నరకాలను ఎండగట్టాడు. మనిషిని శాసించిన మతాలను, అవి సృష్టించిన పాప పుణ్యాలను కాకమ్మ కథలుగా తేల్చేశాడు. పిల్లి నడకలు, బల్లి శాస్త్రాలను ఊడ్చి పారేశాడు. మార్క్స్ నేర్పించిన గతి తార్కిక భౌతిక వాదం, ఐన్‌స్టీన్ విప్పిన గురుత్వాకర్షణ రహస్యం, ఫ్రాయిడ్ నిరూపించిన మనస్తత్వ సిద్ధాంతాలు ఆధునిక సమాజ ముఖ చిత్రాన్ని మార్చినట్టే సోమసుందర్ ఆలోచనారీతిని కూడా మార్చేశాయి. వీటి వెలుగులో సోమసుందర్ బలపరచుకున్న హేతువాదాన్ని కొలమానంగా స్వీకరించి పాటించాడు. ఎవరెంత సాధించినా, మనిషే చివరి లక్ష్యం కావాలని బోధించాడు. మానవ శ్రేయస్సు కోరలేని ఏ కళైనా, ఏ శాస్త్రమైనా వృథా అని చాటి చెప్పాడు. గేయ-వృత్త-వచన రూపాలు, అభివ్యక్తి-సంవిధానంలో ప్రదర్శించిన టెక్నిక్‌లు సోమసుందర్ విశిష్ట శిల్పానికి ప్రాణం పోశాయి. 'ఉపమల' కన్నా 'రూపకాలకే' బలమైన వ్యక్తీకరణ శక్తి ఉందని నమ్మే సోమసుందర్‌లో విభిన్న వస్తు-రూపాలను గమనించవచ్చు. రానున్న కాలంలో మానవ సమాజం ఎలా ఉండాలో చెప్తూ.. "ఆగామిక శతాబ్దంలోనైనా ఆకలినీ కన్నీళ్ళనీ నిషేధించుకొనే అమృత శక్తిని అందించనీ. మట్టికి జలసత్వాలనూ, మనిషికి జవసత్వాలనూ చేకూరుస్తూ శుభోదయాల స్వాగతిస్తాను"(జీవన లిపి). తను చేయాల్సిన పని ఇంకా మిగిలిఉందని, అది గాంధేయ మార్గంలో సాధించాల్సిన అవసరంఉందని మథన పడుతూ.. " కర్తవ్య పాలనమై ఇన్ని దశకాలైపోయిందా - ఐనా నా గుండెలోని ముసలాయని రాట్నం వడకడం మానలేదు. అదేం చిత్రమో ఆ మధుప ఝుంకారం - చిత్ర చంచరీకమై ఎన్నెన్ని భాషలనో అంతర్నిబిడీకరించుకుంది. ఆయన జ్ఞాపకం చేస్తూనే ఉన్నాడు. ఇంకా ఎన్నో మైళ్ళదూరం ముందుకు సాగాలి. ఇంకా ఎన్నో వాగ్దానాలు నెరవేర్చాలి. ఇంకా ఎన్నో ముళ్ళ డొంకల్ని కూకటి వ్రేళ్ళతో పెకలించి దహనం చేయాలి" (సీకింగ్ మై బ్రోకెన్ వింగ్) అని కోరుకున్నాడు. మానవతావాదిగా, అభ్యుదయ కవిత్వ ప్రవర్థకుడిగా ఎనలేని సేవచేశాడు. విమర్శకుడిగా దాదాపు అభ్యుదయ కవులందరి సాహిత్య సమాలోచనచేసి, సాహిత్య విమర్శా చరిత్రలో కూడా తనపేరు సుస్థిరం చేసుకున్నాడు. సుమారు డెబ్బై ఏళ్ళ సాహితీ జీవితాన్ని ఉన్నత విలువలకోసం త్యాగం చేశాడు. భారతీయ నాగరికతలోని ఉత్తమ సంప్రదాయాలను గౌరవిస్తూనే, విప్లవాత్మకమైన నూతన విలువల్ని సమాజంలో పరిణమింపజేయడానికి సోమసుందర్ కృషి చేశాడు. తెలుగు సాహిత్య చరిత్రలో సోమసుందర్ స్థానం చెరిగిపోనిది. వజ్రాయుధ కవిగా, వజ్రాయుధం లాంటి సాహిత్య కారుడుగా ఆయన సేవలు అజరామరం.

(సోమసుందర్ సాహిత్య కార్య క్షేత్రం అయిన పిఠాపురంలో శతజయంతి ప్రారంభసభ జరుగుతున్న సందర్భంగా)

(రచయిత అరసం కడప జిల్లా అధ్యక్షుడు
సెల్: 8328296952)

తాండవిస్తున్న కరువు- పట్టించుకోని ప్రభుత్వం



జి.ఓబులేశు

రాష్ట్రంలో కరువు విలయతాండవం చేస్తున్నది. బండరాయి ప్రభుత్వానికి ఇవేమీ పట్టడం లేదు. రాజకీయ మనుగడకు ప్రత్యర్థి వర్గాలపై పగలు, కక్షలు, కార్పణ్యాలు. ప్రజలపై ఎందుకింత అక్కసు అనుకున్నా.. ముఖ్యమంత్రే స్వయంగా నేను రాచరిక వ్యవస్థలో నిర్దయులైన ప్రభువులు ప్రజలను ఎలా వేధించేవారో.. నేను దానికి సరిగ్గా అతికే మనిషినని చెప్పుకుంటున్నాడు. రాష్ట్రంలో 670 మండలాల్లో 444 మండలాల్లో కరువుతో తీవ్రమైన దుర్భిక్షం నెలకొందని, ఖరీఫ్, రబీ సీజన్లు రెండూ నిర్ధారించిన తరువాతనైనా మస్తిష్కంలో మెదడు, హృదయంలో చలనం ఉంటే మనిషి ఆలోచిస్తాడు. శరీరంలో కదిలక ఉంటుంది. బండబారిన ప్రభుత్వానికి, అధికార యంత్రాంగానికి ఆ స్పందనలు లేవని అర్థమవుతున్నది. కేవలం 108 మండలాలు మాత్రమే కరువుకు గురయ్యాయని ప్రకటించి చేతులు దులుపుకున్నారు. కేంద్రానికి నివేదికలు పంపకుండా, కేంద్ర పరిశీలక బృందాలను ఆహ్వానించక, తాత్కాలికంగానో, శాశ్వత పాత్రిపదికనో ఇంత సహాయం చేయమని అడగకుండా ఎలాపొద్దు పుచ్చుతున్నారు. కేంద్రానికి నిన్నటి వరకు నివేదికలు పంపకుండా పరిశీలక బృందాలను ఆహ్వానించకుండా, శాశ్వత ప్రాతిపదికన నష్టం ఎంత వచ్చిందో తెలియకుండా రూ.660 కోట్లు సహాయం కావాలని ఎట్లా అడుగుతారు. రాష్ట్రంలో 86లక్షల ఎకరాల్లో విత్తనం వేయాల్సి ఉంటే కేవలం 68 లక్షల ఎకరాల్లో మాత్రమే విత్తనం వేస్తే అన్ని రకాల పంటలతో కలిపి 80లక్షల ఎకరాల్లో పంటలే పెట్టకపోతే 660 కోట్లు నష్టం అని ఎలా నిర్ధారిస్తారు. ఎకరానికి లక్ష రూపాయలు దిగుబడి వచ్చినా 80 లక్షల ఎకరాలకు 15వేల కోట్లు నష్టం రైతుకు వాటిల్లుతుంది. ఇది కంటికి కనపడని, అధికారులకు అందని నష్టం. పాలకుడు నీతి బాహ్యుడైతే నడిపించే అధికార యంత్రాంగానికి ఏమి తెగులుసోకింది? ఇది రాష్ట్రంలో ఏ ప్రాంతానికి వెళ్లినా జనం నుండి వినిపించే మాట. ఈ మధ్య సీపీఐ మూడు ప్రతినిధి బృందాలు రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాల కరువు పరిశీలన చేసింది. అందులో వార్తల్లోకి రాని అధికారులు, చూపునకు అందని, అంచనాలకూ దొరకని అనేక యదార్థ బాధామయ గాథలు కనిపించాయి. ఈ వ్యాసకర్త ఓబులేసు, రామచంద్రయ్యలు స్థానిక జిల్లా పార్టీలు, రైతు సంఘాల నాయకులతో అనంతపురం, సత్యసాయి, కడప జిల్లాల పర్యటనలో రైతులు, ఇతర గ్రామీణ, కష్టజీవులు ఎదుర్కొంటున్న ఒకటి, రెండు సమస్యలు ప్రస్తావించుకోవాల్సి ఉంది.అనంతపురం జిల్లా కూడేరు మండలం రైతుబాట పోలప్ప తనకున్న 5 ఎకరాల పొలంలో ఎకరాకు 80వేలు పెట్టుబడిపెట్టి విత్తనాలు, ఎరువులు, సేద్యాలు, పురుగు మందులకు ఖర్చు చేస్తే పశువులకు మేత కూడా దక్కకుండా పైరంతా ఎండిపోయిందని విలపించాడు. ఈ లెక్కన 5 ఎకరాలకు లక్ష 50వేలు పెట్టుబడి- కుటుంబ సభ్యుల చాకిరీకి విలువలేదు. పెట్టిన పెట్టుబడి లక్ష 50వేలు అయితే, సకాలంలో వర్షాలు వచ్చి పైర్లు పండితే ఎకరాకు 20 బస్తాల లెక్కన 100 బస్తాల వేరుశెనగలు-వీటివిలువ- ఇదంతా రైతు నష్టపోయాడు. కంటికి కానరాని ఈ కష్టాలు ఎవ్వరికి చెప్పుకోవాలి. +×రావాల్సిన దిగుబడికి లెక్కకట్టి ఇవ్వకపోయినా ఎకరానికి 80వేలు ఇన్‌పుట్ సబ్సిడీ రైతు అడిగితే నేరమా? 70, 80 రోజులకు చేతికి వచ్చే పంట కొర్రలు, మినుములు, ఉలవలు, బుడ్డ శనగ తదితర పంటలకు విత్తనాలు, ఎరువులు, మందులు, సబ్సిడీ ధరలకు అందిస్తే రైతు బతికి బట్టకడతాడు కదా? కానీ మన మూర్ఖ పాలకులకు అది ఇష్టం ఉండదు. కష్టజీవుల స్వేదం నుండి, ఒనకూడిన సంపద నుండి లక్షల కోట్లు బ్యాంకు ఎగవేతదారులకు, ప్రజలను పీల్చి పిప్పిచేసే కార్పొరేటు తిమింగలాలకు పాత అప్పులన్నీ రద్దు చేస్తున్నారు. రిజర్వు బ్యాంకు ఇండియా మాజీ గవర్నరు రంగరాజన్ కార్పొరేట్ కంపెనీలకు రాయితీ ఇచ్చిన, రద్దు చేసిన అప్పుల వివరాలను ప్రకటించారు. ముఖేష్ అంబాని లక్ష 87వేల 70 కోట్లు, అనిల్ అంబాని లక్షా 24వేల 956 కోట్లు, రూలీయా బ్రదర్స్ లక్ష 1వేయి 461కోట్లు, అనిల్ అగర్వాల్ లక్ష 8వేల 840 కోట్లు, గౌతం ఆదాని 96వేల 81కోట్లు, మనోజ్ గౌర్ 75వేల 165 కోట్లు, సజ్జన్ జిందాల్ ర్8వేల 171 కోట్లు , లాంకో మధు 47వేల 102 కోట్లు, జీఎంరావు 47వేల 976కోట్లు, వివిన్ ధూప్ 45వేల 400కోట్లు, జి.వి.కె రెడ్డి 88వేల 988కోట్లు ఈ విధంగా 28లక్షల కోట్ల మొండి బకాయిలు రద్దు చేశారు. వీరికి ఇంతకు పది ఇంతల ఆస్తులుఉన్నాయి. వాటిని అటాచ్ చేసి సగం రాబట్టినా రైతుల కష్టాలు తీరుతాయి. అప్పుల్లో పుట్టి అప్పుల్లో పెరిగి, అప్పుల్లో చనిపోతున్న అన్నదాత రైతన్నకు రుణమాఫీ చేయడానికి ప్రభుత్వాలకు చేతులు రావడం లేదు. కార్పొరేట్ కంపెనీలకు మాత్రం తిరిగి సంపాదించుకోవడానికి వడ్డీలేని, ఎటువంటి పూచీకత్తులేని రుణాలు తిరిగి ఇస్తున్నారు. ఏమైనా ఉద్యమాలు జరిగి రైతులు, ప్రజాసంఘాలు గట్టిగా అడిగితే కొంతమంది స్వయం ప్రకటిత మేధావులు దేశ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమౌతుందని వాపోతున్నారు. 28లక్షల కోట్లలో సగం డబ్బులు రాబట్టినా దాన్ని రైతుల కష్టాలు తీర్చడానికి ఉపయోగపడుతుంది. అదే కుదేరు గ్రామంలో రమేష్ అనే రైతు తనకున్న 4 ఎకరాల భూమిలో అరటిచెట్లు నాటాడు. ఎకరాకు 1.50లక్షలు ఖర్చు. తన పొలంతో పాటు మరో 4 ఎకరాలు కౌలుకు తీసుకున్నాడు. మొత్తంగా 12 లక్షలు పెట్టుబడి పెట్టినా చిటికినవేలు అంత లావు ఉన్నాయని అరటి కాయలు కొనేవాడు లేడు. తాడిపత్రి మార్కెట్‌లో టన్ను 20వేలు ఉంటే మధ్య దళారులు గ్రామాలపై పడి 15వేలకు ఇస్తే సరి.. లేకుంటే అంతే సంగతులు అంటున్నారని - సంగటి, కారానికి వచ్చినా సాల్లే అని ముందే బేరం

కుదుర్చుకుంటున్నారు. పొరపాటున ఒక తడికినీల్లు వచ్చినా పంట దిగుబడి వస్తుంది. అదంతా దళారి జేబులోకే. సత్యసాయి జిల్లా బత్తలపల్లి గ్రామ మొత్తానికి 7వేల ఎకరాలు భూమి ఉంది. అందులో వేరుశనగ 4వేలు, కంది 2వేలు, ఆముదం 1000 ఎకరాలు. మొత్తం పైర్లన్నీ ఎండిపోయాయి. భూములు ఎండమావులను తలపిస్తున్నాయి. ఇన్‌పుట్ సబ్సిడీ 40వేలు ఎకరాలు ఇచ్చి, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద 200 రోజులు పనిని ఇచ్చి రోజు కూలి 600రూపాయలు అడుగుతున్నారు. ఇది నేరమా? ఇవ్వ సాధ్యం కానిదా? కేంద్రమే పనిదినాలు పెంచుతున్నాం.. కూలీ పెంచుతామంటున్నారు. కేరళ చేసి చూపించింది. జగన్‌మోహన్‌రెడ్డి సొంత జిల్లా మేనమామ నియోజక వర్గం కమలాపురం దగ్గర ఉన్న చదిపిరాళ్ళ పల్లెకు వస్తే ఆ ఊర్లో ఉన్నది 1000 ఎకరాల పొలం. అందులో 500 ఎకరాల్లో విత్తనమే వేయలేదు. మినుములు, వేరుశనగ వేసిన 500 ఎకరాల్లో పంట పూర్తిగా ఎండిపోయింది. నవంబరు, డిసెంబరులో తుఫాన్లు వస్తే బుడ్డశనగ వేసుకుందామనుకుంటే అందులో కూడా అవినీతే. బయట మార్కెట్‌లో శనగలు రూ. 6000 ఉంటే, ప్రభుత్వం రూ. 8,500 పెట్టి కొని 80శాతం సబ్సిడీతో విత్తనాల సరఫరా చేస్తున్నామని బడాయి ప్రచారం చేసుకుంటున్నది. గ్రామంలో ఉన్న 1000 ఎకరాల్లో 500 ఎకరాల్లో విత్తనమే వేయక, వేసినది ఎండిపోతే అది కరువు గాక ఇంకేమిటి? రోమ్ నగరం తగలబడిపోతుంటే నీరో చక్రవర్తి ఫిడేలు వాయిస్తూ కూర్చున్నాడట. ఇక్కడ జిల్లాలో మామా అల్లుళ్ళ పరిస్థితి అలాగే ఏడుస్తున్నదని ఆ గ్రామానికి చెందిన రైతులు భాస్కర్‌రెడ్డి, క్రిష్టారెడ్డి విలపిస్తున్నారు. జగన్ మేనమామ రవీంద్రనాథ్ అనుంగ శిష్యుడా? సుధీర్‌రెడ్డి జమ్మలమడుగు ఎమ్మెల్యే నిర్వాకం వామికొండ, సర్వరాయ సాగర్ రిజర్వాయర్ల క్రింద ఆయకట్టు రైతుల బాధలు గురించి వివరించకపోతే నాకు (ఒకప్పుడు ఆ ప్రాంతానికి జెడ్పీటీసీ మెంబరుగా పనిచేసిన) మనసొప్పదు. జమ్మలమడుగు నియోజకవర్గం ముద్దనూరు మండలంలో ఒంటిగారిపల్లె అనే చిన్న గ్రామం వామికొండ రిజర్వాయరు ఆయకట్టు క్రింద ఉంది. అక్కడ 60 కుటుంబాలు, 170 జనాభా ఉంది. మునక గ్రామంగా తీసుకోనందున రిజర్వాయర్ నుండి నీటి వూట వచ్చి గ్రామాన్ని మొత్తం ముంచెత్తింది. జమ్ము, పీచు పడి 200 ఎకరాలు పొలం పాడైంది. దారులన్నీ మూసుకుపోయాయి. . పాములు, జర్రులతో జనం సహజీవనం . ఒకటికాదు, రెండు కాదు 4ఏండ్లుగా ఇదే బాధ. గ్రామాన్ని మునక ప్రాంతంగా ప్రకటించి ఇంటికో కోటి పరిహారం ఇస్తే ఇంకోచోటు సురక్షితంగా బ్రతుకుతారు. వామికొండ రిజర్వాయర్ ఉత్తర కాల్వ మరమ్మత్తులు చేస్తే, సర్కారు కంప తొలగించి పంట కాల్వలు తవ్వితే వ్యవసాయానికి నీరు దొరుకుతుంది. అంగట్లో అన్నీ ఉన్నాయి. అల్లుడి నోట్లో శని అని రిజర్వాయర్లలో నీళ్లుండి పంట పొలాలకు ఇవ్వలేని అసమర్థ ప్రభుత్వం. ఇదే 8వేల 4కోట్లు ఖర్చు చేస్తే 11,500 ఎకరాలకు సాగునీరు ఇవ్వవచ్చు. రైతులు, ప్రజలు ఎన్నికల్లో బుద్ధి చెబుదాం అంటే కుదరదు. ఉద్యమించాల్సిందే. ప్రస్తుతం రాష్ట్రంలో కర్నూలు, అనంతపురం, రాయచోటి, కడప ప్రాంతాల నుంచి వేలకు వేలు వలసలు అటు బెంగుళూరు, ఇటు చెన్నై నగరాలకు వెళ్లిపోతున్నారు. మనవారు పరాయి నేల మీద కడుపు చేతపట్టుకుని అవమానాలకు గురై జీవచ్ఛవంలా బతుకుతూ ఉంటే జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి కనువిప్పు కలగడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే రాష్ట్రాన్ని కరువు రాష్ట్రంగా ప్రకటించి కరువు సహాయ కార్యక్రమాలు చేపట్టాలి. పశువులకు ఉచితంగా మేత సరఫరా చేయాలి. కుటుంబాలు నిలదొక్కుకోవడానికి ప్రతి కుటుంబానికి అవసరమైన మేర బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులు సరఫరా చేయాలి. కరువు పనులు ప్రారంభించాలి. ఇందుకోసం రేపు 20,21 తారీఖుల్లో జరిగే సీపీఐ ఆందోళనలో ప్రజలంతా పాల్గొని జగన్ ప్రభుత్వానికి కళ్ళు తెరిపించాలి.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు
9490952505

విశాలాంధ్ర
5
ఆదివారం
19 నవంబరు 2023

బీజేపీ దళిత వ్యతిరేకి

- మోదీ ఎంత ప్రయత్నించినా గెలిచేది కాంగ్రెస్సే
- మలింగాకు టికెట్ ఇవ్వడం సిగ్గుచేటు: ఖర్గే, గెహ్లాత్

జైపూర్: ప్రధాని మోదీ ఎన్ని ప్రయత్నాలు చేసుకున్నాగానీ చివరకు గెలిచేది మాత్రం కాంగ్రెసేనని ఆపార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. పేదలను మరింత పేదలుగా... ధనికులను సంపన్నులుగా మార్చిన ఘనత బీజేపీకే దక్కిందన్నారు. రాజస్తాన్, భరత్‌పూర్ జిల్లా వెయిర్ బహిరంగ సభలో ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. మిత్రల ప్రయోజనాల కోసమే బీజేపీ పని చేస్తుందని విమర్శించారు. కాంగ్రెస్ ఎప్పుడు పేదల పక్షాన్నే నిలుస్తుందని, వారి సంక్షేమం, రైతులు, యువతరం బాగు కోసం పరితపిస్తుందని తెలిపారు. 'మేము పేదల కోసం ఏమైనా చేస్తే దానిని ఉచితాలని మోదీ అంటారు. ఆయన మాత్రం సంపన్నులకు రూ.15లక్షలకోట్ల రుణమాఫీ చేస్తారు' అని దుయ్యబట్టారు. యువతను మభ్యపెట్టేందుకు అగ్నివీర్ పథకాన్ని బీజేపీ తెచ్చిందని, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక దీనిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఖర్గే హామీనిచ్చారు. దళిత ఇంజినీర్‌ని దారుణంగా కొట్టిన, ఆయనను మంచానికే పరిమితం చేసిన నేతకు టికెట్ ఇవ్వడానికి కాంగ్రెస్ నిరాకరిస్తే బీజేపీ మాత్రం అక్కున చేర్చుకున్నదని విమర్శించారు. బీజేపీ దళిత వ్యతిరేకని ఈ చర్య స్పష్టంచేస్తోందన్నారు. ఇంజినీర్ హర్షాధిపతి వాల్మీకిపై దాడికి పాల్పడిన సిట్టింగ్ ఎమ్మెల్యే గిరిరాజ్ సింగ్ మలింగాకు బీజేపీ టికెట్ ఇవ్వడం సిగ్గుచేటన్నారు. రాజస్తాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్ కూడా బీజేపీపై విమర్శలు గుప్పించారు.

మలింగాకు టికెట్ ఇవ్వడం ద్వారా రాజస్తాన్ రాజకీయాల్లో నల్ల అధ్యాయనాన్ని బీజేపీ లిఖించిందని, దళిత వ్యతిరేక మనస్తత్వాన్ని బయటపెట్టుకున్నదని విమర్శించారు. 'ముందు దాడిని ఖండించి...ఆపై దాడి చేసిన వ్యక్తిని హత్తుకున్నది. టికెట్ కూడా ఇచ్చింది. గెలుపు/అధికారం కోసం బీజేపీ ఏ స్థాయికి దిగజారగలదో దీనినిబట్టి తెలుసుకోవచ్చు' అని గెహ్లాత్ అన్నారు. థోల్‌పూర్, బారి స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా మలింగా పోటీ చేయనున్నారు. జైపూర్, ఎస్ఎంఎస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇంజినీర్‌ని ఖర్గే పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 'ఆ నేత చేసిన పనికిగాను మేము టికెట్ ఇవ్వలేదు. నేను పేదోడినని చెప్పుకునే ప్రధాని, పేదలకు రక్షణ గురించి మాట్లాడే బీజేపీ మాత్రం ఆవ్యక్తి (మలింగానుద్దేశించి)కి టికెట్ ఇచ్చింది. ఇది సిగ్గుచేటు. దీనిని ఖండిస్తున్నా' అని అన్నారు. గతేడాది మార్చిలో ఇంజినీర్ వాల్మీకిపై దాడి జరిగింది. అప్పటి నుంచి ఆయన మంచానికి పరిమితయ్యారు. థోల్‌పూర్ జిల్లా, బారిలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో ఇద్దరు ఇంజినీర్లపై దాడి చేసినట్లు మలింగాపై కేసు నమోదైంది. జైపూర్ పోలీసు కమిషనర్ ఎదుట లొంగిపోవడంతో మలింగా అరెస్టు అయ్యారు. అనంతరం ఆయనకు బెయిల్ లభించింది.

అక్కడ పోలింగ్ అధికారులంతా మహిళలే!

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లో రెండో విడత అసెంబ్లీ ఎన్నికల్లో ఆ రాష్ట్ర రాజధాని రాయ్‌పూర్ రికార్డు నెలకొల్పింది. రాయ్‌పూర్ (నార్త్)లో శుక్రవారం పోలింగ్ ప్రక్రియ ఆసాంతం మహిళా అధికారులు, సిబ్బంది చేతులమీదుగానే నడిచింది. ప్రిసైడింగ్ అధికారి మొదలుకొని పోలింగ్ అధికారి వరకు మొత్తం 201 పోలింగ్ బూత్‌ల్లో మహిళలకు మాత్రమే బాధ్యతలు అప్పగించినట్లు జిల్లా యంత్రాంగం ఒక ప్రకటనలో తెలిపింది. 'సంగ్వారీ (ఉమెన్ ఫ్రెండ్లీ) బూత్‌లకు పూర్తిగా మహిళా అధికారులను నియమించాం. 804 మంది మహిళలకు ప్రత్యక్ష బాధ్యతలు అప్పగించాం. మరో 200 మందిని రిజర్వులో ఉంచాం. ఇక్కడ ఐఏఎస్ అధికారి ఆర్.విమలను పరిశీలకురాలిగా నియమించాం. లైజాన్ అధికారి కూడా మహిళే. చాలా వరకు పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతకు మహిళా సిబ్బందినే నియమించాం'అని ఆ ప్రకటన వెల్లడించింది. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మహిళా ఐఏఎస్ రీనా బాబా సాహెబ్ కంగాలె కావడం విశేషమని ఆ ప్రకటన తెలిపింది.

మహిళా అధికారులే పోలింగ్ నిర్వహించిన రాయ్‌పూర్(నార్త్)నియోజకవర్గంలో స్త్రీ, పురుష నిష్పత్తి కూడా 1010:1000గా ఉండటం మరో విశేషమని పేర్కొంది. రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ మొదలైన తర్వాతే ఒక నియోజకవర్గంలో పోలింగ్ బాధ్యతలను కేవలం మహిళలకే అప్పగించాలన్న ఆలోచన రూపుదిద్దుకుందని రాయ్‌పూర్ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ సర్వేశ్వర్ నరేంద్ర భూరె తెలిపారు. ఈ మేరకు చేపట్టిన చర్యలు విజయవంతం కావడంతో ఇప్పుడు అందరూ తమను ప్రశంసిస్తున్నారని చెప్పారు. రాయ్‌పూర్ సిటీ(సౌత్) నియోజకవర్గంలోని సగం వరకు బూత్‌ల్లోనూ మహిళా అధికారులనే నియమించినట్లు ఆయన తెలిపారు.

సవాయి మాధోపూర్‌లో హోరాహోరీ

- రాజస్తాన్ అసెంబ్లీ పోరులో త్రిముఖ పోటీ
- బీజేపీకి రెబెల్ బెడద... కుల సమీకరణాలే కీలకం

సవాయి మాధోపూర్ (రాజస్తాన్) : రణథంబోర్ టైగర్ రిజర్వ్ పక్కన ఉన్న రాజస్తాన్‌లోని సవాయి మాధోపూర్ పట్టణంలో అసెంబ్లీ ఎన్నికల పోటీలో పర్యావరణ సమస్యలు నిర్ణయాత్మక కారకం కాదు... కుల సమీకరణాలే కీలకం. ఇక్కడ దృష్టంతా హోరాహోరీగా జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలపై ఉంది. బీజేపీకి చెందిన రాజ్యసభ ఎంపీ కిరోడి లాల్ మీనా... కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యే డానిష్ అబ్రార్‌తో పోటీ పడుతున్నారు. ఇక కాషాయ పార్టీ టికెట్ నిరాకరించిన తర్వాత బీజేపీ రెబల్ ఆషా మీనా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసిన ఆమె... అబ్రార్‌పై ఓడిపోయారు. మీనాలు, ముస్లింలు, గుర్జర్‌ల జనాభా గణనీయంగా ఉన్న ఈ నియోజకవర్గంలో పోటీ మరింత రసవత్తరంగా మారింది. తూర్పు రాజస్థాన్‌లో ఇది కీలకమైన స్థానం, ముక్కోణపు పోటీ జరుగుతుండటంతో అందరి దృష్టి దానిపైనే ఉంది. సవాయ్ మాధోపూర్‌లో 2,36,199 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 1,63,584 మంది 2018లో ఓటు వేశారు. కాంగ్రెస్‌కు చెందిన అబ్రార్ 85,655 ఓట్లతో విజయం సాధించారు. బీజేపీకి చెందిన ఆశా మీనా కంటే 25 వేల ఓట్లు ఎక్కువ. అబ్రార్‌కు ముస్లింలు, గుర్జర్‌లు, ఇతర వర్గాల ఓట్లు ఎక్కువగా లభించగా, మీనాలు ఎక్కువగా ఆశా మీనా వైపు నిలిచారు. అశోక్ గెహ్లాత్ ప్రభుత్వంపై 2020లో జరిగిన తిరుగుబాటులో సచిన్ పైలట్‌కు అండగా నిలవకపోవడంతో ఈసారి అబ్రార్ గుర్జార్ ఓట్లను పొందడంలో ఇబ్బంది పడుతుండగా, బీజేపీ అభ్యర్థి కిరోడి లాల్ మీనా... మీనాల ఓట్లలో చీలికను ఎదుర్కొంటున్నారు. సమీప నియోజకవర్గాల్లో సానుకూల ప్రభావం చూపే ప్రయత్నంలో మీనా సామాజిక వర్గానికి చెందిన ప్రముఖుడు కిరోడి లాల్ మీనాను బీజేపీ రంగంలోకి దించింది. అంతేకాదు గిరిజన సంఘంలో తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్నాడు. 'డాక్టర్ సాహబ్', 'బాబా'గా పిలువబడే కిరోడి లాల్ మీనా, గెహ్లాట్ ప్రభుత్వంపై బీజేపీ అవినీతి ఆరోపణలకు నాయకత్వం వహించినందున ఇటీవల రాష్ట్ర రాజకీయాలకు కేంద్రబిందువుగా ఉన్నారు. ఇటీవలి కాలంలో మీనా వరుసగా విలేకరుల సమావేశాలు నిర్వహిస్తూ, రాష్ట్ర ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారు. ఈడీ వంటి కేంద్ర ఏజెన్సీలు తరచుగా అతని ఆరోపణలను అనుసరించాయి. అయితే ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్ దర్యాప్తు సంస్థలను బీజేపీ దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. 'గెహ్లాత్ సూచన మేరకు తిరుగుబాటు అభ్యర్థిని కుట్రగా ఆసరా చేసుకున్నారు' అని కిరోడి లాల్ మీనా పీటీఐకి చెప్పారు. గిరిజన సంఘం తనతో బలంగా ఉన్నందున ఎలాంటి ప్రభావం ఉండదని పేర్కొన్నారు. ఇక్కడ త్రిముఖ పోటీ ఎంత హోరాహోరీగా ఉండబోతున్నదనేది ప్రజల స్పందన తెలియజేస్తోంది. వారు ఈ ముగ్గురు విషయంలో ఎటూ తేల్చుకోలేకపోతున్నారు. 'డాక్టర్ సాహబ్ స్పష్టమైన విజేత అవుతారు. ఇది తన చివరి ఎన్నికలని ఆయన చెప్పారు. అది తన వర్గ ప్రజలను ఉత్తేజపరిచింది. అతను మీనాలకు దూత. ఆశా మీనా కొన్ని ఓట్లను చీల్చే అవకాశం ఉన్నప్పటికీ, కిరోడి లాల్ జీ బ్రాహ్మణులు, సాంప్రదాయ బీజేపీ ఓటర్లు వంటి ఇతర వర్గాలు ఉన్నందున ఆయన ప్రయాణం సాగిస్తారు' అని ట్రావెల్ ఏజెన్సీ నిర్వాహకుడు ధరమ్ సింగ్ రాజావత్ పీటీఐకి తెలిపారు. ఇదే విధమైన అభిప్రాయాలను ప్రతిధ్వనిస్తూ, టాక్సీ డ్రైవర్ పుఖ్‌రాజ్ మీనా మాట్లాడుతూ బీజేపీ ఎంపీ అనుభవజ్ఞుడని, మీనాల మద్దతు ఉందని, అతనిని దెబ్బతీయడానికి ఆశా మీనా ఉన్నప్పటికీ గణనీయమైన ప్రభావం చూపదని తెలిపారు. అయితే ఈ ప్రాంతంలో ఆశా మీనాకు గట్టి పలుకుబడి ఉందని, లెక్కలో చాలా ఉందని అన్నారు. పాన్ షాప్ యజమాని పవన్ మీనా 'ఆమె కచ్చితంగా చాలా ఓట్లను సాధిస్తుంది. ఇది ఇక్కడ చాలా దగ్గరగా ఉంది. ముగ్గురు అభ్యర్థులకు అవకాశం ఉంది. సిట్టింగ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే కూడా మంచి పని చేశారు. అతను కూడా తిరిగి ఎన్నికవ్వగలడు' అని తెలిపారు. ఇక ఎంఐఎం అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే కుమారుడు అయిన మరొక ముస్లిం స్వతంత్ర అభ్యర్థి కూడా బరిలో ఉన్నారు. అయితే 'డానిష్ చాలా పని చేశాడు. ముస్లింలు అతనికి మద్దతు ఇస్తున్నారు. చాలా మంది షెడ్యూల్డ్ కులాలు కూడా ఉన్నారు.

అభివృద్ధి పనులు జరిగాయి' అని బ్యాటరీ ఆటో రిక్షా డ్రైవర్ చెప్పారు. సిట్టింగ్ ఎమ్మెల్యే ఎన్నో అభివృద్ధి పనులు చేసినా ఎన్నికల సమయంలో కుల సమీకరణలు వస్తాయని స్థానికులు అంటున్నారు. ముగ్గురు అభ్యర్థులు బలంగా ఉండటంతో ఇక్కడ రాజకీయ ఉత్కంఠ నెలకొంది. రిజర్వ్‌లోని ఏ జోన్‌లో పులి కనిపించిందనేది రోజువారీ చర్చనీయాంశం కాకుండా ఇక్కడ ప్రజలు ఒక సారి ఎన్నికల పోటీ గురించి చర్చిస్తున్నట్లు కనిపిస్తోంది. 1972 నుంచి 2018 వరకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ నాలుగుసార్లు, బీజేపీ మూడుసార్లు గెలుపొందాయి. దీంతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా రెండుసార్లు గెలుపొందగా, జనతాదళ్, జనతా పార్టీ ఒక్కోసారి విజయం సాధించాయి. రాజస్తాన్‌లో నవంబరు 25న ఎన్నికలు జరగనుండగా, డిసెంబరు 3న ఫలితాలు వెలువడనున్నాయి.

కాంగ్రెస్‌తో అవినీతి... బీజేపీ వస్తే అభివృద్ధి

రాజస్తాన్ ప్రచార ర్యాలీలో నడ్డా

జైపూర్: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అవినీతి, లూటీలు జరుగుతాయని, అదే బీజేపీ వస్తే అభివృద్ధి జరుగుతుందని ఆ పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. ఆయన శనివారం జోధ్‌పూర్‌లో పీపడ్‌లో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో ప్రసంగించారు. అవినీతి, మహిళలపై నేరాల్లో దేశంలోనే నంబర్ వన్‌గా రాజస్తాన్‌ను అశోక్ గెహ్లాత్ నేతృత్వ కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపిందని విమర్శించారు. రైతులకు, మహిళలకు న్యాయం జరగాలంటే బీజేపీ అధికారంలోకి రావాల్సిందేనన్నారు. రాజస్తాన్ ప్రతిష్ఠను గెహ్లాత్ ప్రభుత్వం కళంకితం చేసిందని అవినీతి, మహిళలకు వేధింపులు, వారిపై అత్యాచారాలు రాజస్తాన్‌లో పేట్రేగాయని నడ్డా ఆరోపించారు. రైతులు, దళితులను గెహ్లాత్ ప్రభుత్వం అవమానించిందన్నారు. సచిన్ పైలట్, అశోక్ గెహ్లాత్ ఐదేళ్లుగా కుర్చీ కోసం కొట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ కుట్ర 'రెడ్ డైరీ' అన్న గెహ్లాత్ వ్యాఖ్యలను తోసిపుచ్చుతూ రాజేంద్ర గుఢాను బీఎస్పీ నుంచి కాంగ్రెస్‌లోకి తెచ్చి మంత్రి పదవి ఇచ్చి... ఇప్పుడేమో అవినీతి (రెడ్ డైరీ) డైరీ అని చెబుతారా అంటూ నడ్డా ఎదురుదాడికి దిగారు. 2జీ కుంభకోణం, సబ్‌మెరైన్ కుంభకోణం, బొగ్గు కుంభకోణం వంటివన్నీ కాంగ్రెస్ ఘనతలేనని వ్యాఖ్యానించారు. జల్ జీవన్ మిషన్‌ను జేబులు నింపుకునే మిషన్‌గా గెహ్లాత్ మార్చేశారని, వృద్ధాప్య పింఛన్‌లోనూ కుంభకోణం జరిగిందని,. అత్యాచార కేసుల్లో రాజస్తాన్ నంబర్ వన్ అని ఎన్‌సీఆర్‌బీ చెబుతోందని నడ్డా ఆరోపణలు చేశారు.

ఎన్నికల తర్వాత కాంగ్రెస్ కనిపించదు

- రాజస్తాన్‌లో నేరాలు, ఘోరాలు అత్యధికం
- భరత్‌పూర్ ర్యాలీలో మోదీ విమర్శలు

జైపూర్: నేరాలు, ఘోరాల్లో రాజస్తాన్‌ను అగ్రస్థానంలో నిలబెట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే చెందుతుందని ప్రధాని మోదీ అన్నారు. మాంత్రికుడి ప్రభుత్వం రాష్ట్రాన్ని మైనింగ్ మాఫియాకు అప్పగించిందని గెహ్లాత్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. డిసెంబరు 3 (ఫలితాల తేదీ) తర్వాత రాష్ట్రం నుంచి కాంగ్రెస్ కనుమరుగు అవుతుందని శనివారం రాజస్తాన్ భరత్‌పూర్‌లో జరిగిన బీజేపీ ర్యాలీలో మోదీ ఉద్ఘాటించారు. గెహ్లాత్‌నుద్దేశించి జాదూగర్ (మాంత్రికుడు)కు ఓటు వేయరాదని రాజస్తాన్ ప్రజలు నిర్ణయించుకున్నారన్నారు. 'కాంగ్రెస్ అధికారంలో ఉంటే ఉగ్రవాదులు, నేరగాళ్లు, అల్లరిమూకలు పేట్రేగిపోతాయి. అన్ని చోట్ల మెప్పు రాజకీయాలనే కాంగ్రెస్ చేస్తుంది. ఇందుకోసం ఎంత వరకైనా వెళ్లగలదు. మీ (రాజస్తాన్ ప్రజలనుద్దేశించి) ప్రాణాలను కూడా పణంగా పెట్టగలదు. ఐదేళ్లుగా రాజస్తాన్‌లో ఏం జరుగుతుందో అందరికీ తెలుసు. అవినీతి, అల్లర్లు, నేరాలు, ఘోరాల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా కాంగ్రెస్ నిలిపింది. అందుకోసమే మాంత్రికుడికి ఓటు వేయమని రాజస్తాన్ ప్రజలు అంటున్నారు. ఐదేళ్ల కాంగ్రెస్ పాలనలో మహిళలు, దళితులపై అత్యధిక నేరాలు జరిగాయి. హోలీ, రామనవమి, హనుమాన్ జయంతి... సందర్భాల్లో అల్లర్లు, రాళ్లదాడులు చోటుచేసుకున్నాయి' అని మోదీ అన్నారు. మహిళలు తప్పుడు అత్యాచార కేసులు పెడతారనే ముఖ్యమంత్రి రాష్ట్ర మహిళలకు రక్షణ కల్పించగలరా? ఇలాంటి వ్యక్తికి సీఎం కుర్చీలో కూర్చునే అర్హత ఉందా? ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నందుకు కాంగ్రెస్ సిగ్గుపడాలి' అని అన్నారు. అత్యాచార ఘటనలను హేళన చేసిన మంత్రి శాంతి ధారివాల్‌పై చర్యలు తీసుకోకపోవడాన్ని మోదీ ప్రశ్నించారు. సీఎం రహస్యాలు తెలుసు కాబట్టే మంత్రిని శిక్షించకుండా వదిలేశారా? అతనికి టికెట్ కూడా ఇచ్చి సన్మానించారు. అధిష్ఠానం కూడా తలొగ్గిందంటే ఆ మంత్రి వద్ద ఇంకో 'రెడ్ డైరీ' ఏమైనా ఉందా! అని మోదీ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ దళిత వ్యతిరేకని, ఓ దళితుడు ప్రధాన సమాచార కమిషనర్ కావడాన్ని జీర్ణించుకోలేకపోతోందన్నారు. రాజస్తాన్ డీగ్ జిల్లాకు చెందిన హీరాలాల్ సమారియా కొత్త సీఐసీగా నియమితులవ్వడాన్ని ఉద్దేశించి మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. రాజస్తాన్‌లో పెట్రోల్, డీజిల్ అధిక ధరలు, ద్రవ్యోల్బణానికి అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిందించారు. పక్క రాష్ట్రాలైన హరియాణా, ఉత్తరప్రదేశ్ గుజరాత్‌లో లీటర్ పెట్రోల్ రూ.97గా ఉంటే రాజస్తాన్‌లో లీటరు ధర రూ.109గా ఉందన్నారు. ప్రతి లీటరుపై రూ.12ను మీ నుంచి వసూలుచేసి తమ జేబులు నింపుకుంటున్నారని మోదీ వ్యాఖ్యానించారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కాగానే కాంగ్రెస్ క్రీడలన్నీ ముగుస్తాయన్నారు. అధికారంలోకి రాగానే ఇంధనం ధరలను బీజేపీ సమీక్షిస్తుందని మోదీ చెప్పారు.

కొండచరియలు విరిగిపడి నలుగురి మృతి

ఇటానగర్: అరుణాచల్‌ప్రదేశ్‌లో కొండచరియలు విరిగిపడిన ప్రమాదంలో ఓ ఆధ్యాత్మిక నాయకుడు, ఆయన ముగ్గురు అనుచరులు చనిపోయారు. ఆ నలుగురు ప్రయాణిస్తున్న వాహనంపై కొండచరియలు విరిగిపడి మృతి చెందారని ఎస్పీ థుటాన్ జంబా చెప్పారు. కమ్లే జిల్లాలోని నిర్మాణంలో గల అరుణాచల్ జాతీయ రహదారిపై శుక్రవారం ఈ ప్రమాదం జరిగింది. ఆధ్యాత్మిక నాయకుడు పశ్చిమబెంగాల్‌లోని జల్పాయ్‌గురికి చెందిన వారు కాగా ఆయన అనుచరులు అసోంకు చెందిన వారని ఎస్పీ వివరించారు. ధుంపోరిజీలో మూడు రోజుల పాటు జరిగిన ఓ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొని వారంతా ఇటానగర్ వెళుతుండగా ప్రమాదానికి గురైనట్లు చెప్పారు. పోలీసులు రంగంలోకి దిగి శిథిలాల నుంచి మృతదేహాలను వెలికితీశారు.

వారి బలం క్షీణిస్తోంది

సొరంగంలో చిక్కుకున్న కార్మికుల కుటుంబాల ఆవేదన

ఉత్తరకాశీ (ఉత్తరాఖండ్) : వారి గొంతులు బలహీనపడుతున్నాయని, వారి బలం క్షీణిస్తోందని ఇక్కడ సిల్క్యారా సొరంగంలో ఏడు రోజులుగా లోపల చిక్కుకున్న కార్మికులతో మాట్లాడిన తర్వాత శనివారం వారి బంధువులు వ్యక్తం చేసిన ఆవేదన ఇది. చార్ ధామ్ మార్గంలో నిర్మాణంలో ఉన్న సొరంగం ఆదివారం ఉదయం కూలిపోయి అందులో 41 మంది కూలీలు చిక్కుకుపోయారు. గంటలు గడిచేకొద్దీ, బయటే వేచి ఉన్న వారి కుటుంబ సభ్యుల్లో నిరాశ పెరుగుతోంది. కార్మికులకు తప్పించుకునే మార్గాన్ని సిద్ధం చేయడానికి శిథిలాల గుండా పైపులను డ్రిల్ చేయడానికి, నెట్టడానికి అమెరికా నిర్మిత ఆగర్ యంత్రాన్ని మోహరించడంతో శుక్రవారం నుంచి సహాయక కార్యకలాపాలు నిలిచిపోయాయి. ఇది ఆందోళనను తీవ్రతరం చేసింది. 'చీకటి సొరంగం లోపల గంటలు గడిచే కొద్దీ కార్మికుల ఆరోగ్య పరిస్థితి మరింత దిగజారుతోంది. ఇంటికి తిరిగి వచ్చిన బాధిత కార్మికుని కుటుంబం మరింత భయాందోళనలకు గురవుతోంది' అని హరిద్వార్ శర్మ చెప్పారు. అతని తమ్ముడు సుశీల్ సొరంగం లోపల చిక్కుకున్న వారిలో ఉన్నాడు. 'మేము పొందుతున్నదల్లా చిక్కుకున్న కార్మికులను రక్షించే అధికారుల నుంచి హామీలు. దాదాపు వారం రోజులైంది' అని బీహార్‌లోని రోహ్తాస్ జిల్లాకు చెందిన శర్మ పీటీఐకి చెప్పారు. 'సొరంగం లోపల ఎలాంటి పనులు జరగడం లేదు. కంపెనీ కానీ, ప్రభుత్వం కానీ ఏమీ చేయడం లేదు. ఒక యంత్రం రాబోతోందని కంపెనీ చెబుతోంది' అని కన్నీళ్లు పెట్టుకున్నాడు. ఎదురు చూస్తున్న వారిలో గబ్బర్ సింగ్ నేగీ కుటుంబం కూడా ఉంది. అతని ఇద్దరు సోదరులు, మహరాజ్ సింగ్, ప్రేమ్ సింగ్, అలాగే అతని కుమారుడు ఆకాశ్ సింగ్ బయటే వేచి చూస్తున్నారు. కార్మికులు బయటకు వచ్చే ఏదైనా వార్త కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. వారిది రాష్ట్రంలోని కోట్‌ద్వార్‌కు చెందిన కుటుంబం. ఆక్సిజన్ సరఫరా కోసం ఉపయోగించే పైపు ద్వారా గబ్బర్‌తో మాట్లాడానని, అతని గొంతు చాలా బలహీనంగా ఉందని మహరాజ్ చెప్పారు. 'నేను మా అన్నయ్యతో మాట్లాడలేకపోయాను. అతని గొంతు చాలా బలహీనంగా ఉంది. సొరంగంలో సహాయక చర్యలు నిలిచిపోయాయి. చిక్కుకున్న వారికి ఆహారం, నీరు కూడా దొరకడం లేదు. మా ఓపిక నశించిపోయింది. ఇంతకంటే ఏం చెప్పగలను?' అని మహరాజ్ పీటీఐతో అన్నారు. చిక్కుకున్న కార్మికులు ఆశలు కోల్పోయారని వారి సోదరుడు ప్రేమ్ అన్నారు. 'గబ్బర్ తాను బాగానే ఉన్నాడని చెప్పాడు. కానీ అతని గొంతు ఇప్పుడు బలహీనంగా ఉంది. చానా, ఖీర్, బాదం వంటి తేలికైన తినుబండారాలు లభిస్తున్నాయి. వారు దీన్ని ఎంతకాలం కొనసాగించగలరు? సొరంగం లోపల 30-32 గంటల పాటు పనులు నిలిచిపోయాయి' అని ప్రేమ్ చెప్పారు. 'భారతదేశం డిజిటల్‌గా మారింది. వారు భారతదేశం చంద్రయాన్ మిషన్ విజయం గురించి మాట్లాడతారు. కానీ వారు సొరంగంలో వారం రోజులుగా చిక్కుకున్న ఉన్న మన ప్రజలను మాత్రం రక్షించలేరు. గబ్బర్ కొడుకు ఆకాశ్ సింగ్ ఆవేదన వ్యక్తం చేశాడు. 'అతని గొంతు క్షీణించింది. కంగారుపడవద్దని తాను బాగానే ఉన్నాడని చెప్పాడు. కానీ క్షీణించిన అతని స్వరం అంతా చెప్పింది. సొరంగం లోపల ఎలాంటి పనులు జరగడం లేదు. లోపల ఇంజనీర్లు ఎవరూ లేరు. చిక్కుకున్న కార్మికులకు ఎప్పటికప్పుడు ఆహారం, నీటిని పైపు ద్వారా పంపే వ్యక్తులు మాత్రమే అక్కడ ఉన్నారు' అని ఆకాశ్ వివరించాడు. ఆందోళన స్థాయిలు పెరగడంతో ఇండోర్ నుంచి విమానంలో తరలించిన అత్యాధునిక డ్రిల్లింగ్ మెషిన్ డెహ్రాడూన్‌లోని జాలీగ్రాంట్ విమానాశ్రయానికి చేరుకుందని, రోడ్డు మార్గంలో సిల్క్యారాకు తీసుకువెళ్లి అక్కడ డ్రిల్లింగ్ కోసం మోహరించడానికి ముందు దానిని తిరిగి అమర్చడం చేస్తామని అక్కడి అధికారులు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం ఆపరేషన్‌ను నిలిపివేసే సమయానికి భారీ ఆగర్ యంత్రం సొరంగం లోపల 60 మీటర్ల విస్తీర్ణంలో విస్తరించిన శిథిలాల ద్వారా 24 మీటర్ల వరకు డ్రిల్లింగ్ చేసింది. శుక్రవారం మధ్యాహ్నం 2.45 గంటల ప్రాంతంలో ఐదవ పైపును అమర్చే సమయంలో సొరంగంలో పెద్ద పగుళ్లు రావడంతో సహాయక ఆపరేషన్‌ను వెంటనే నిలిపివేసినట్లు జాతీయ రహదారులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్‌ఐడీసీఎల్) ఒక ప్రకటనలో పేర్కొంది. ఆ శబ్దం సహాయక బృందాన్ని భయాందోళనకు గురి చేసింది. ప్రాజెక్టుతో సంబంధం ఉన్న నిపుణుడు సమీపంలో మరింత కూలిపోయే అవకాశం గురించి హెచ్చరించడంతో పైప్‌ను లోపలికి నెట్టడం ఆగిపోయింది.

డీప్-ఫేక్ వంటి సమస్యల నేపథ్యంలో

పోలీసులు సాంకేతికతను నవీకరించుకోవాలి

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

న్యూఢిల్లీ : నేరస్తులు కృత్రిమ మేథస్సును ఉపయోగించడం, డీప్-ఫేక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నందున సాంకేతిక రంగంలో పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు నవీకరించబడాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. శనివారం ఇక్కడ రాష్ట్రపతి భవన్‌లో ఆమెను కలిసిన 2022 బ్యాచ్‌కు చెందిన ఇండియన్ పోలీసు సర్వీస్ (ఐపీఎస్) ప్రొబెషనరి గ్రూప్‌నకు ఉద్దేశించి ప్రసంగిస్తూ, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వ్యాపారం, మావోయిస్టు తీవ్రవాదం, ఉగ్రవాదం వంటి అనేక సవాళ్లు పోలీసు బలగాలకు ఉన్నాయన్నారు. 'కొత్త సాంకేతికత, సామాజిక మాధ్యమాల ప్రభావం వల్ల పరిస్థితులు వేగంగా మారుతున్నాయి. ఉత్పాదక కృత్రిమ మేథస్సును నేరగాళ్లు ఉపయోగిస్తున్నారు. డీప్-ఫేక్ వంటి సమస్యలు తెరపైకి వస్తున్నాయి' అని ముర్ము అన్నారు. సాంకేతిక రంగంలో పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు నవీకరించుకోవాలని, నేరగాళ్లను అదుపు చేసేలా ఉండాలని తెలిపారు. ప్రొబేషనర్లను ఉద్దేశించి రాష్ట్రపతి మాట్లాడుతూ పోలీసు పరిపాలన, శాంతిభద్రతల ప్రధాన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. 'కానీ రాష్ట్ర ప్రభుత్వాలు నియమించిన పోలీసు సిబ్బందికి ఐపీఎస్ అధికారులు నాయకత్వం వహిస్తారు. ఈ విధంగా దేశ పోలీసు వ్యవస్థను అఖిల భారత సమూహంలో ఏకం చేసే పనిని ఇండియన్ పోలీస్ సర్వీస్ అధికారులు చేస్తారు' అని ఆమె పేర్కొన్నారని రాష్ట్రపతి భవన్ విడుదల చేసిన ఒక ప్రకటన తెలిపింది. ఆర్థిక, సామాజిక అభివృద్ధికి శాంతిభద్రతల పటిష్టత తప్పనిసరి అని రాష్ట్రపతి అన్నారు. 'ప్రపంచవ్యాప్తంగా, జాతీయంగా, స్థానికంగా శాంతిభద్రతల వ్యవస్థ బలంగా లేని చోట పారిశ్రామికవేత్తలు పెట్టుబడి పెట్టడానికి ఇష్టపడరు. అందువల్ల, ఏ ప్రాంతమైనా బహుళ కోణాల అభివృద్ధిలో పోలీసు శాఖ ప్రధాన పాత్ర పోషిస్తుంది' అని తెలిపారు. దేశంలో శాంతిభద్రతల పరిరక్షణలో, దేశ ఐక్యత, సమగ్రతను చెక్కుచెదరకుండా ఉంచడంలో పోలీసు బలగాలు ఎనలేని కృషి చేశాయని అన్నారు. ప్రతి పౌరుడి ప్రతిభ, సామర్థ్యాలను పెంపొందించే అవకాశాలను కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ముర్ము పేర్కొన్నారు. 'అభివృద్ధి ప్రయాణంలో పౌరులందరూ భాగస్వాములు కావడమే మన జాతీయ ప్రాధాన్యత' అని అన్నారు. 'అమృత్‌కాల్'లో దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే సంకల్పాన్ని నెరవేర్చడంలో పోలీసు అధికారులు కూడా నిర్ణయాత్మక పాత్ర పోషిస్తారని ఆమె తెలిపారు.

రాజకీయాల్లో మరింత రాణించాలి

ఉద్యమాలు ఉధృతం చేయాలి

మహిళా సమాఖ్య ప్రతినిధుల సభలో రామకృష్ణ ఉద్బోధ

విశాలాంధ్ర-నంద్యాల: మహిళలు రాజకీయాల్లో మరింత రాణించాల్సిన అవసరం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఉద్బోధించారు. కేవలం ధర్నాలకే పరిమితం కాకుండా ఉద్యమాలను ఉధృతం చేయాలని సూచించారు. మహిళా సమాఖ్య 15వ రాష్ట్ర మహాసభల సందర్భంగా శనివారం ఇక్కడ జరిగిన ప్రతినిధుల సభలో రామకృష్ణ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ మార్పులు ఎప్పటికప్పుడు గమనించాలని హితవు పలికారు. మహిళా సమాఖ్యది పోరాటాల చరిత్రని, రానున్న రోజుల్లో చట్టసభలకు మూడు శాతం మంది వస్తారని తెలిపారు. తొమ్మిదిన్నరేళ్లలో మోదీ దేశానికి చేసిందేమీ లేదని రామకృష్ణ విమర్శించారు. ధరలు తగ్గిస్తానని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని, విదేశాల నుంచి నల్లడబ్బు వెనక్కి తీసుకొస్తానని ఊదరగొట్టిన ప్రధాని మోదీ...ఒక్క హామీ కూడా అమలు చేయలేదని ఆరోపించారు. ప్రజలు, ప్రాంతాలు, మతాల మధ్య చీలికలు తీసుకురావడం ప్రధాని మోదీకి వెన్నతో పెట్టిన విద్య అని వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రివర్గంలో ఒక్క ముస్లింకు స్థానం కల్పించలేదని, అలాంటి మోదీ మైనారిటీలను ఉద్ధరిస్తానని ప్రగల్భాలు పలుకుతున్నారని విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి 2014 వరకు భారతదేశం అప్పు రూ.55 లక్షల కోట్లు కాగా... మోదీ పదేళ్ల కాలంలో రూ.100 లక్షల కోట్లు అప్పు చేశారని నిందించారు. దేశాన్ని అప్పులపాలు చేసిన మోదీ...తిరిగి మూడోసారి అధికారంలోకి రావాలని కలలు కంటున్నారని, మోదీకి అధికారం ఇస్తే దేశంలో ప్రమాదకర పరిస్థితులు వస్తాయని రామకృష్ణ హెచ్చరించారు. అసమ్మతి, ధిక్కార గళాలను అణచివేయడమే పనిగా పెట్టుకున్నారని చెప్పారు. అందులో భాగంగా ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మేధావులను జైళ్లకు పంపుతున్నారని ఆరోపించారు. ప్రొఫెసర్ సాయిబాబాను 8 ఏళ్ల నుండి జైల్లో ఉంచారన్నారు. మహిళా సమాఖ్య నాయకత్వంలో మరిన్ని పోరాటాలు జరగాలని, స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో ఉద్యమాలను ఉధృతం చేయాలని రామకృష్ణ పిలుపునిచ్చారు.

జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తోందని రామకృష్ణ విమర్శించారు. మీట నొక్కి రూ.2.50 లక్షల కోట్లు అక్కచెల్లెమ్మ కుటుంబాల ఖాతాల్లో వేశానని జగన్ పదేపదే చెబుతున్నారని, ఇదే సమయంలో మద్యం ద్వారా నాలుగున్నరేళ్లలో రూ.1.50 లక్షల కోట్లు సంపాదించారని, దీనికి ఏమి సమాధానం చెబుతారని ముఖ్యమంత్రి జగన్‌ను ప్రశ్నించారు. అధికారంలోకి వస్తే మద్య నిషేధం అమలు చేస్తానని హామీ ఇచ్చారని, కానీ ఊరూరా బెల్ట్ షాపులు పెట్టి సొంతంగా మద్యం విక్రయిస్తున్నారని ఆరోపించారు. జగన్ ప్రభుత్వం రూ.7.50 లక్షల కోట్లు అప్పు చేసిందని, మరి 2.50 లక్షల కోట్లు ప్రజలకు పంచితే...మిగిలిన రూ.5 లక్షల కోట్లు ఏమి చేశావని ప్రశ్నించారు. జగన్ హయాంలో ఒక్క పరిశ్రమ కూడా రాష్ట్రానికి రాలేదన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రామచంద్రయ్య, చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడారు. సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు, మహిళా సమాఖ్య జాతీయ నాయకురాలు అక్కినేని వనజ, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయలక్ష్మి, దుర్గాభవాని, కమిటీ సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జెండా ఎగురవేస్తున్న సంజీవమ్మ

అమరవీరులకు నివాళి అర్పిస్తున్న మహిళా నేతలు

ఇస్రో శాస్త్రవేత్త మాధవరాజ్‌కు 'మనోహర్ పారికర్ యువ శాస్త్రవేత్త అవార్డు'

పనాజి : గోవా ప్రభుత్వం ఏర్పాటు చేసిన తొలి 'మనోహర్ పారికర్ యువ సైంటిస్ట్ అవార్డు'ను వచ్చే నెలలో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) యుఆర్ రావు శాటిలైట్ సెంటర్‌కు చెందిన డాక్టర్ మాధవరాజ్ ఎస్‌కు అందజేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ ప్రకటించారు. డాక్టర్ అనిల్ కకోద్కర్ నేతృత్వంలోని ఎంపిక కమిటీ చంద్రయాన్-3 మిషన్ శక్తితో కూడిన అవరోహణ పథాన్ని రూపొందించిన డాక్టర్ మాధవరాజ్‌ను అవార్డుకు ఎంపిక చేసింది. సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' లో తన పోస్ట్‌లో సావంత్ శుక్రవారం ఇలా పేర్కొన్నారు. 'మొదటి మనోహర్ పారికర్ యువ శాస్త్రవేత్త అవార్డు ఎంపిక పూర్తయింది. యువ శాస్త్రవేత్త ఎంపిక నిపుణుల కమిటీకి అధ్యక్షత వహించిన డాక్టర్ అనిల్ కకోద్కర్ ఈ సాయంత్రం ఫలితాలను నాకు అందజేశారు. చంద్రుని దక్షిణ ధ్రువంపై విజయవంతంగా దిగిన చంద్రయాన్-3 మిషన్‌కు చెందిన శక్తితో కూడిన డీసెంట్ (అవరోహణ) పథాన్ని రూపొందించిన వ్యక్తికి ఈ అవార్డు లభించిందని ప్రకటించడానికి సంతోషంగా ఉంది. అవార్డ్ గ్రహీత యూఆర్ రావు శాటిలైట్ సెంటర్, ఇస్రోకు చెందిన డాక్టర్ ఎస్.మాధవరాజ్ 106 మంది దరఖాస్తుదారులు ఉండగా, వారిలో 14 మందిని షార్ట్‌లిస్ట్ చేశారు. ఈ అవార్డు కింద రూ.5 లక్షల నగదు, ప్రశంసా పత్రాన్ని అందజేస్తారు. ఇది ప్రస్తుతం శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన రంగంలో అత్యధిక నగదు బహుమతి అని సావంత్ చెప్పారు. 'ఈ అవార్డును డిసెంబరు 13, 2023న మనోహర్ పారికర్ విజ్ఞాన మహోత్సవ్‌లో అంటే డాక్టర్ మనోహర్ పారికర్ జన్మదినం సందర్భంగా ప్రదానం చేస్తారు' అని ముఖ్యమంత్రి తెలిపారు.

ఎన్టీఆర్ స్మారక నాణెం రికార్డు విక్రయాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : హైదరాబాద్ మింట్‌లో తయారైన ఎన్టీఆర్ తొలి స్మారక నాణెం విక్రయాలు కేవలం రెండున్నర నెలల్లో 25 వేలు అమ్ముడుపోవడం దేశంలోనే సరికొత్త రికార్డు అని మింట్ చీఫ్ జనరల్ మేనేజర్ వి.ఎస్.ఆర్.నాయుడు చెప్పారు. శనివారం ఎన్టీఆర్ సెంటినరీ కమిటీ చైర్మన్ టి.డి.జనార్దన్ ఏర్పాటు చేసిన సమావేశంలో హైదరాబాద్ మింట్ అధికారులు నాయుడు, శ్రీనివాస్ గండపనేడు, తానాజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ దేశంలో స్మారక నాణేల విడుదల 1964 నుంచి ప్రారంభమైందన్నారు. మొదట జవహర్ లాల్ నెహ్రూ, ఆ తరువాత మహాత్మా గాంధీ లాంటి మహనీయుల నాణేలను కేంద్రం విడుదల చేసిందని తెలిపారు. అయితే ఇప్పటి వరకు స్మారక నాణేలలో 12,000 నాణేలు రికార్డు అని, ఆ రికార్డును ఎన్టీఆర్ స్మారక నాణెం అధిగమించిందన్నారు. ఆగస్టు 28న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నాణెంను దిల్లీలో విడుదల చేశారని, 29 నుంచి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. కేవలం రెండున్నర నెలల్లోనే 25,000 స్మారక నాణేలను విక్రయించడం రికార్డు అని చెప్పారు. జనార్దన్ మాట్లాడుతూ ఎన్టీఆర్ పేరుతో ఏ కార్యక్రమం మొదలు పెట్టినా నిర్విఘ్నంగా జరుగుతుందన్నారు. ఎన్టీఆర్ శతాబ్ది సంవత్సరంలో మా కమిటీ ఆయన శాసన సభ ప్రసంగాలు, చారిత్రిక ఉపన్యాసాలు, శకపురుషుడు ప్రత్యేక సంచికను వెలువరించామని తెలిపారు. దేశంలో ఇప్పటి వరకు 200 నాణేలను విడుదల చేయగా, అందులో అన్నగారి స్మారక నాణెం ప్రథమ శ్రేణిలో ఉండటం తమకు గర్వకారణంగా ఉందన్నారు. ఈ నాణెం గిన్నిస్ రికార్డు సృష్టించాలని కోరుకుంటున్నామని జనార్దన్ చెప్పారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు కంతంనేని రవిశంకర్, భగీరథ, విక్రమ్ పూల, దొప్పలపూడి రామ్ మోహన్, మండవ సతీష్ పాల్గొన్నారు.

దిల్లీ బార్‌లు, పబ్బుల్లో క్రికెట్ ప్రపంచ కప్ జోష్

న్యూదిల్లీ : దిల్లీ బార్‌లు, పబ్‌లు క్రికెట్ ప్రపంచ కప్ ఫైనల్ హంగామాను సొమ్ము చేసుకోవడానికి సిద్ధమవుతున్నాయి. పెద్ద స్క్రీన్ టీవీలను ఏర్పాటు చేయడం నుంచి దిల్లీ-ఎన్‌సీఆర్‌లోని పబ్‌లు, రెస్టారెంట్‌ల్లో ప్రత్యేక పానీయాలు అందించడం వరకు ప్రపంచ కప్ ఫైనల్ ఉత్సాహాన్ని సొమ్ము చేసుకోవడానికి అన్ని విధాలు సన్నద్ధమయ్యాయి. 2023 క్రికెట్ ప్రపంచ కప్ ఫైనల్‌లో భారత్ ఆదివారం ఆస్ట్రేలియాతో తలపడుతుండగా, తమ అభిమాన క్రికెటర్లను గ్లాసుతో గ్లాసుతో ఉత్సాహ పరిచేందుకు బార్‌లు, పబ్‌లు సన్నాహాలు చేశాయి. టోర్నీలో ఇప్పటి వరకు ఆడిన మొత్తం 10 మ్యాచ్‌లు గెలిచిన టీం ఇండియా న్యూజిలాండ్‌పై విజయంతో ఫైనల్‌కు దూసుకెళ్లింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన 2003 ఫైనల్ మ్యాచ్‌లో మెన్ ఇన్ బ్లూ రికార్డు ఛాంపియన్ ఆస్ట్రేలియాతో తలపడుతుంది. 'యస్ మినిస్టర్ పబ్, కిచెన్ ప్రతినిధి అడ్బిని పీటీఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ 'ఇది పెద్ద మ్యాచ్ అయినందున మేము కవర్ చార్జీగా రూ.3 వేలు వసూలు చేస్తున్నాము. సాధారణ రోజుల్లో మేము పోషకుల నుంచి వసూలు చేయము. కానీ పెద్ద మ్యాచ్‌ల కోసం మేము ఈ రేటును ఉంచాము. మెన్ ఇన్ బ్లూ జెర్సీని ధరించి వచ్చే వారి కోసం బీర్ కేఫ్ ప్రత్యేక ఆఫర్లను కలిగి ఉంది' అని తెలిపారు. 'ఫైనల్‌లో టీమ్ ఇండియాతో దేశవ్యాప్తంగా మా అన్ని అవుట్‌లెట్‌లలో పార్టీలను చూడటానికి ఆదివారం అభిమానులను స్వాగతించ డానికి మేము సిద్ధంగా ఉన్నాము. పెద్ద స్క్రీన్‌లపై లైవ్ స్క్రీనింగ్ నుంచి టీమ్ ఇండియా జెర్సీ ధరించిన వారికి ప్రత్యేక ఆఫర్‌ల వరకు, బీర్‌తో ఆనందించడానికి చాలా ఎక్కువ ఉంటుంది' అని బీర్ కేఫ్ వ్యవస్థాపకుడు రాహుల్ సింగ్ పీటీఐకి తెలిపారు. 'మా మిక్సాలజిస్ట్ ఒక ప్రత్యేక 'బ్లీడ్ బ్లూ' షాట్‌ను రూపొందించాం. ఇది అందరికీ అందిస్తాం' అని అన్నారు. గురుగ్రామ్ సైబర్ సిటీలోని ఎస్‌వోఐ7 పబ్, బ్రూవరీ కూడా భిన్నంగా లేదు. ఎస్‌వోఐ 7కు చెందిన లలిత్ అహ్లావత్ మాట్లాడుతూ 'మ్యాచ్‌లను ప్రసారం చేయడానికి మాకు మూడు పెద్ద స్క్రీన్‌లు, మా వినియోగదారుల కోసం కోసం రెండు టీవీ సెట్‌లు ఉన్నాయి. మేము సైబర్ సిటీలో అతిపెద్ద వేదికగా ఉన్నాము. అలాంటి కార్యక్రమా లను చూసేటప్పుడు ఉత్సాహవంతమైన వాతావరణం చాలా ముఖ్యమైనది. మేము భారత జట్టుకు శుభాకాంక్షలు తెలియజేస్తు న్నాము. కాగా, దేశ రాజధానిలో అధిక కాలుష్య స్థాయిలు తమ ఇళ్ల నుంచి బయటకు వెళ్లకుండా వినియోగ దారులను నిరోధించవచ్చని ఒక రెస్టారెంట్ యజమాని అన్నారు. 'ప్రజలు సాధారణంగా వారి స్వంత సన్నిహిత సమావేశాలలో ప్రపంచ కప్‌ను చూడటం ఆనందిస్తారు. అధిక కాలుష్య స్థాయిలు, వేదికల వద్ద వారు విపరీతమైన రద్దీని ఎదుర్కొం టారని ఊహించడం వలన ప్రజలు రెస్టారెంట్లకు రాకుండా దూరంగా ఉంచవచ్చు' అని ఆయన తెలిపారు.



తుది సమరం నేడే

- అహ్మదాబాద్‌లో వన్డే ప్రపంచకప్ ఫైనల్
- అమీ తుమీ తేల్చుకోనున్న భారత్-ఆస్ట్రేలియా
- మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం

అహ్మదాబాద్: ప్రపంచ కప్ ఫైనల్ ఫీవర్ క్రికెట్ అభిమానులను ఊపేస్తోంది. భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య ఆదివారం (నేడు) జరిగే ఐసీసీ వన్డే ప్రపంచ కప్ ఫైనల్ పోరు కోసం యావత్ భారత్ ఉత్కంఠగా ఎదురు చూస్తోంది. వన్డే ప్రపంచకప్ టైటిల్‌కు టీమిండియా మరో అడుగు దూరంలో ఉంది. లీగ్ దశలో 9 మ్యాచ్‌ల్లో అజేయంగా నిలిచిన రోహిత్ సేన... సెమీస్‌లో కివీస్‌ను ఓడించి ఫైనల్ చేరుకుంది. ఆదివారం నాటి టైటిల్ పోరులో భారత్, ఆస్ట్రేలియా తలపడనున్నాయి. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం కానున్న ఫైనల్ మ్యాచ్‌పై భారీ అంచనాలు ఉన్నాయి. బలమైన రెండు జట్లు విశ్వవిజేతగా నిలిచేందుకు నరేంద్రమోదీ స్టేడియంలో కొదమసింహాల్లా తలపడేందుకు సిద్ధమయ్యాయి. ఈ ప్రపంచకప్‌లో ఓటమెరుగని టీమిండియా...చివరి మెట్టుపైనా ఆధిపత్యం చెలాయించి మూడోసారి ప్రపంచ కప్‌ను ముద్దాడాలని అభిమానులు కోరుకుంటున్నారు.

భారత్, ఆసీస్ రెండు జట్లు బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్... ఇలా ఏ విభాగంలోనూ ఎందులోనూ తక్కువ కావు. సమఉజ్జీల సమరంగా ప్రపంచ కప్ ఫైనల్ నిలవనుంది. ఈ ప్రపంచకప్‌లోనే అహ్మదాబాద్‌లో ఇదే వేదికపై టీమిండియా తన మూడో మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ కేవలం 42.5 ఓవర్లలో 191 పరుగులకు ఆలౌటైంది. అనంతరం టీమిండియా 30.3 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. రోహిత్ శర్మ, శ్రేయాస్ అయ్యర్ అర్ధసెంచరీలతో రాణించారు. కాగా ఫైనల్‌పై ఇప్పటికే ఆసీస్ ఆటగాళ్లు మైండ్ గేమ్ ప్రారంభించారు. తమదే గెలుపు అంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. టీమిండియా... తమపై ఒత్తిడి తీసుకురాదని చెప్పలేం కానీ, అన్ని మ్యాచ్‌ల తరహాలోనే ఫైనల్‌లోనూ ముందుకు వెళతామని చెప్పుకొచ్చారు. కంగారూలను కంగారు పెట్టించగలిగిన టీమిండియానే విశ్వవిజేతగా అవతరిస్తుందన్నది అత్యధికుల అభిప్రాయం. ఈ ప్రపంచకప్‌లో టీమిండియా ఇప్పటికే చెన్నైలో జరిగిన లీగ్‌పోరులో ఆస్ట్రేలియాపై 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. సెమీఫైనల్స్‌లో సైతం టీమిండియా కివీస్‌పై ఘన విజయం సాధించగా... ఆసీస్ మాత్రం దక్షిణాఫ్రికాపై అతికష్టం మీద గట్టెక్కింది. కానీ ప్రపంచకప్ నాకౌట్ మ్యాచ్‌ల్లో అద్భుతమైన ట్రాక్ రికార్డు ఉన్న ఆస్ట్రేలియాను తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. ఆసీస్ సైతం బలమైన ప్రత్యర్థి కావటంతో ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా జరగడం ఖాయంగా కనిపిస్తోంది.

ఫైనల్ మ్యాచ్... ప్రత్యేక కార్యక్రమాలు

ప్రపంచకప్ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు బీసీసీఐ ఏర్పాట్లు చేసింది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ విడుదల చేసింది. టాస్ వేసిన అనంతరం 1:35 గంటల నుంచి 1:50 వరకు భారత వాయుసేన అధ్వర్యంలోని సూర్యకిరణ్ ఎయిర్‌బాటిక్ బృందం ఎయిర్‌షో చేయనుంది. మొదటి ఇన్సింగ్స్ డ్రింక్స్ విరామంలో ప్రముఖ నేపథ్య గాయకుడు, గేయ రచయిత ఆదిత్య గద్వీతో సంగీత కార్యక్రమం, తొలి ఇన్నింగ్స్ విరామ సమయంలో ప్రీతమ్, జోనితా గాంధీ, తుషార్ జోషీ తదితరుల నేతృత్వంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రెండో ఇన్నింగ్స్ విరామ సమయంలో లేజర్, లైట్ షో ఉంటుంది.

రోహిత్ అద్భుత కెప్టెన్: జహీర్‌ఖాన్

కెప్టెన్ రోహిత్ శర్మపై టీమిండియా మాజీ ఫాస్ట్‌బౌలర్ జహీర్‌ఖాన్ ప్రశంసలు కురిపించాడు. అతడు అద్భుతమైన నాయకుడని, ఈ ప్రపంచకప్‌లో కెప్టెన్సీ విషయంలో మరింత దూకుడు చూపించడంతోపాటు కూల్‌గా కూడా కనిపిస్తున్నాడని జహీర్‌ఖాన్ పేర్కొన్నాడు. 'రోహిత్ శర్మ అద్భుతమైన నాయకుడు. ఈ ప్రపంచకప్‌లో కెప్టెన్సీలో దూకుడు చూపించాడు. అదే సమయంలో రిలాక్స్‌డ్‌గానూ ఉన్నాడు. అతడు బ్యాటింగ్‌లోనూ దూకుడు చూపిస్తున్నాడు. మంచి స్ట్రైక్ రేట్‌తో ఆడుతున్నాడు. కెప్టెన్ నుంచి జట్టు అదే కోరుకుంటుంది. ఎన్నోసార్లు ఫైనల్ మ్యాచ్‌ల్లో కెప్టెన్సీ చేసిన అనుభవం రోహిత్‌కు ఉంది. పెద్ద మ్యాచ్‌ల్లో జట్టును ఎలా ముందుకు నడిపించాలో అతడికి బాగా తెలుసు. ఐపీఎల్‌తోపాటు కొన్ని ప్రధాన టోర్నీల్లో కెప్టెన్‌గా అతడు ఎలా రాణించాడో మనం చూశాం. ట్రోఫీలు గెలవడానికి ఏమి అవసరమో అతనికి కచ్చితంగా తెలుసు. దీంతో ప్రపంచకప్ ఫైనల్‌లో అతడు జట్టును చాలా సింపుల్‌గా ముందుకు నడిపిస్తున్నాడని భావిస్తున్నా. మార్పులేమీ చేయకుండా, ఇదివరకు మ్యాచ్‌ల్లో ఆడిన విధంగా ముందుకెళ్లాలి' అని జహీర్‌ఖాన్ సూచించాడు.

టీమిండియా దుర్భేద్యం: గంగూలీ

టీమిండియాకు భారత మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ కొన్ని సూచనలు చేశాడు. భారత జట్టు దుర్భేద్యంగా కనిపిస్తోందని... ఇప్పటివరకు టోర్నీలో రోహిత్ సేన అద్భుతంగా ఆడిందని, ఇదే ఆటతీరును ఫైనల్‌లో కొనసాగిస్తే భారత్‌కు తిరుగుండదని గంగూలీ పేర్కొన్నాడు.

కొత్త వ్యూహం అవసరం లేదు: రవిశాస్త్రి

ఫైనల్స్ వేళ టీమిండియా మాజీ కోచ్ రవిశాస్త్రి కీలక సూచన చేశాడు. ప్రపంచ కప్‌లో ఇప్పటి వరకు అనుసరిస్తున్న వ్యూహానికే ఫైనల్‌లోనూ కట్టుబడి ఉండాలని తెలిపాడు. భారత జట్టు ప్రశాంతంగా ఉంది. జట్టు సొంతగడ్డపై ఆడుతోంది. బాగా అనుభవం ఉన్న జట్టు ఇది. ఏదీ భిన్నంగా చేయాల్సిన అవసరం లేదు. ఇప్పటి వరకు ఆడుతున్నట్లే...గత మ్యాచ్‌ను ముగించిన మాదిరే ఆడితే సరిపోతుందని సలహా ఇచ్చాడు. టీమిండియా ప్రపంచ కప్ అందుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశాడు. జట్టులో 8, 9 మంది ఆటగాళ్లు రాణిస్తుండటం శుభసంకేతమని చెప్పిన రవిశాస్త్రి...ఇంతకంటే ఏమి కావాలని ప్రశ్నించారు. ఆటగాళ్ల ఒత్తిడిని దరి చేరనీయొద్దని..ఫైనల్ కాబట్టి అత్యుత్సాహం ప్రదర్శించవద్దని సూచించాడు. జట్టులో ప్రతీ ఒక్కరికీ తమ బాధ్యతేంటో తెలుసని వ్యాఖ్యానించాడు. ఒకరో, ఇద్దరి పైనో జట్టు ఆధారపడకపోవటం కలిసొచ్చే అంశంగా రవిశాస్త్రి విశ్లేషించాడు. టీమిండియా ప్రధాన కోచ్ రాహుల్ ద్రావిడ్, కెప్టెన్ రోహిత్ ఇప్పటికే అహ్మదాబాద్ పిచ్‌ను పరిశీలించారు. వ్యూహాలు, జట్టు తుది కూర్పుపై ఒక అంచనాకు వచ్చారు. ఆసీస్ బ్యాటర్లను కట్టడి చేసేందుకు అనుసరించాల్సిన బౌలింగ్ వ్యూహంతో సిద్ధమయ్యారు. అదే విధంగా చెన్నైలో జరిగిన తొలి మ్యాచ్‌లో ఆసీస్ బౌలర్లు ఆదిలోనే భారత బ్యాటర్లను అవుట్ చేయటంతో...ఇప్పుడు ఏ విధంగా వాళ్లను ఓపెనర్లు ఎదుర్కోవాలనేది కీలకంగా మారుతోంది. అదేసమయంలో ఫైనల్ మ్యాచ్‌లో టాస్ మరింత కీలక భూమిక పోషించే అవకాశం కనిపిస్తోంది.

ఆస్ట్రేలియా కూడా పటిష్ఠంగా ఉండటంతో మ్యాచ్ ఆసక్తికరంగా ఉంటుందన్నాడు.

విన్నింగ్ కెప్టెన్లకు సన్మానం

ఫైనల్ మ్యాచ్ వీక్షించడానికి క్రికెట్ దిగ్గజాలు హాజరుకానున్నారు. ఇప్పటివరకు ఆయా జట్లకు ప్రపంచకప్ అందించిన కెప్టెన్లు స్టేడియానికి వచ్చి మ్యాచ్ వీక్షించనున్నారు. దీంతో ప్రపంచకప్ విన్నింగ్స్ కెప్టెన్లకు సన్మానం చేయడానికి బీసీసీఐ ఏర్పాట్లు చేసింది. మొదటి ఇన్నింగ్స్ పూర్తయిన అనంతరం మహేంద్రసింగ్ ధోనీ, కపిల్‌దేవ్, రికీ పాంటింగ్, క్లైవ్ లాయిడ్, అలన్ బోర్డర్, ఇయాన్ మోర్గాన్, అర్జున రణతుంగలను ప్రత్యేక బ్లేజర్లతో సత్కరించనుంది. ప్రజెంటేషన్ వేడుకలో ప్రపంచకప్‌లో ఆయా కెప్టెన్ల మధుర జ్ఞాపకాలకు సంబంధించిన షార్ట్ క్లిప్పింగులు చూపించనున్నారు. చిన్నపాటి క్వశ్చన్ అండ్ అన్సర్ సెషన్ కూడా నిర్వహించనున్నారు. ఫైనల్ మ్యాచ్ వీక్షించడానికి భారత ప్రధాని నరేంద్రమోదీ, ఆస్ట్రేలియా ఉప ప్రధానమంత్రి మార్లెస్ రానున్నారు.

మ్యాచ్‌కోసం ప్రత్యేక రైళ్లు

ప్రపంచ కప్ ఫైనల్‌ను దృష్టిలో ఉంచుకుని అభిమానుల సౌకర్యార్థం అహ్మదాబాద్‌కు భారత రైల్వే ప్రత్యేక రైళ్లు నడపనుంది. శనివారం దిల్లీ నుంచి అహ్మదాబాద్‌కు ప్రత్యేక రైలు నడపనున్నట్లు అధికారులు తెలిపారు. ఆదివారం రాత్రి మ్యాచ్ ముగిసిన తర్వాత రైలు అహ్మదాబాద్ నుంచి తెల్లవారుజామున 2:30 గంటలకు దిల్లీకి బయలుదేరుతుంది. ముంబై-అహ్మదాబాద్ మధ్య కూడా మ్యాచ్ కోసం మూడు రైళ్లు ఏర్పాటు చేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.